

కరీంనగర్ వార్త

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

శుక్రవారం 17, జులై 2026 16 పేజీలు



అంబేద్కర్ భవనానికి నిధులు ఇవ్వండి

2లో



2లో

రెండుగా రామగుండం ?

డీలిమిటేషన్‌తో పట్టణ ఓటర్లే నిర్ణయాత్మక శక్తిగా అవతరించే అవకాశం

మండలాలు, గ్రామాల పునర్విభజనతో సరిహద్దుల్లో భారీ మార్పులు

కొత్త నియోజకవర్గాల ఏర్పాటుతో మారనున్న రాజకీయ సమీకరణాలు

మహిళా రిజర్వేషన్‌తో నాయకత్వంలో కొత్త సమీకరణాలకు అస్కారం

గోదావరిఖని, ప్రభాతవార్త: దేశవ్యాప్తంగా జనాభా ప్రాతిపదికన అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియ చేపడితే రామగుండం అసెంబ్లీ నియోజకవర్గం రూపురేఖలు పూర్తిగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 119 అసెంబ్లీ స్థానాలను 182కు పెంచే అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల భౌగోళిక సరిహద్దులు, ఓటర్ల సంఖ్య, పరిపాలనా విభజనను కొత్తగా రూపొందించే పరిస్థితి ఏర్పడనుంది. ఈ మార్పుల్లో పారిశ్రామిక నగరంగా గుర్తింపు పొందిన రామగుండం నియోజకవర్గంపై ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

సిరిసిల్లలో మళ్లీ ఫుడ్ పాయిజన్ కలకలం

బకాసుర రెస్టారెంట్‌లో బిర్యానీ తిని నలుగురు యువకులకు అస్వస్థత..

ఆసుపత్రి పాలైన బాధితులు.. తనిఖీలు కరువయ్యాయంటున్న స్థానికులు



2లో

సిరిసిల్ల అర్బన్, ప్రభాత వార్త:రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మరోసారి ఫుడ్ పాయిజన్ ఘటన కలకలం రేపింది. పట్టణంలోని ఖిబకాసురఖి రెస్టారెంట్‌లో మండి బిర్యానీ తిన్న నలుగురు యువకులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బిర్యానీ ఆరగించిన కొద్దిసేపటికే వీరంతా వాంతులు, విరేచనాలతో కుప్పకూలారు. గమనించిన స్థానికులు వెంటనే వారిని వైద్యం నిమిత్తం తరలించారు. బాధితుల్లో ఒకరి పరిస్థితి తీవ్రంగా ఉండటంతో హుటాహుటిన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన ముగ్గురు యువకులకు సమీపంలోని ఆర్ఎంపీ వైద్యుడి వద్ద ప్రాథమిక చికిత్స అందించారు.

కోరుట్లలో మార్పు కోసమే

నా పోరాటం...

కవితమ్మ నాయకత్వమే ప్రజలకు భరోసా..!

నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, సామాజిక కార్యకర్త డాక్టర్ రఘు



2లో

ప్రభాతవార్త, మెట్‌పల్లి డివిజన్ : కోరుట్ల నియోజకవర్గ రాజకీయాల్లో సంచలనం. గత 20 ఏళ్లుగా ప్రజాసేవలో ఉన్న డాక్టర్ రఘు తాజాగా తెలంగాణ రక్షణ సమితిలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 19న పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కల్వకుంట్ల కవితమ్మ ఆధ్వర్యంలో అధికారికంగా చేరనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా "ప్రభాతవార్త"తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు.

రెండుగా రామగుండం ?

డీలిమిటేషన్‌తో పట్టణ ఓటర్లే నిర్ణయాత్మక శక్తిగా అవతరించే అవకాశం
మండలాలు, గ్రామాల పునర్విభజనతో సరిహద్దుల్లో భారీ మార్పులు
కొత్త నియోజకవర్గాల ఏర్పాటుతో మారనున్న రాజకీయ సమీకరణాలు
మహిళా రిజర్వేషన్‌తో నాయకత్వంలో కొత్త సమీకరణాలకు ఆస్కారం



గోదావరిఖని, ప్రభాతవార్త: దేశవ్యాప్తంగా జనాభా ప్రాతిపదికన అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియ చేపడితే రామగుండం అసెంబ్లీ నియోజకవర్గం రూపురేఖలు పూర్తిగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 119 అసెంబ్లీ స్థానాలను 182కు పెంచే అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల భౌగోళిక సరిహద్దులు, ఓటర్ల సంఖ్య, పరిపాలనా విభజనను కొత్తగా రూపొందించే పరిస్థితి ఏర్పడనుంది. ఈ మార్పుల్లో పారిశ్రామిక నగరంగా గుర్తింపు పొందిన రామగుండం నియోజకవర్గంపై ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి గత కొన్నేళ్లలో గణనీయంగా విస్తరించింది. సమీప గ్రామాలు కార్పొరేషన్‌లో విలీనం కావడంతో జనాభా, ఓటర్ల సంఖ్య పెరిగింది. ఈ పరిస్థితుల్లో డీలిమిటేషన్ అమలైతే గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ఓటర్ల సంఖ్య మరింత అధికంగా ఉండే నియోజకవర్గంగా రామగుండం మారే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో ఎన్నికల ప్రచారం, రాజకీయ వ్యూహాలు, అభివృద్ధి హామీలు కూడా పూర్తిగా పట్టణ అవసరాల చుట్టూనే తిరిగే అవకాశాలు ఉన్నాయి.ప్రస్తుతం రామగుండం నియోజకవర్గంలో మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు అంతర్గాం, పాలకుర్తి మండలాల పరిధిలోని పలు గ్రామాలు ఉన్నాయి. డీలిమిటేషన్‌లో ప్రతి నియోజకవర్గంలో సమాన జనాభా ఉండేలా పునర్విభజన చేపట్టే అవకాశం ఉంది. ఈ క్రమంలో కొన్ని గ్రామాలను పెద్దపల్లి, మంథని లేదా చెన్నూర్ నియోజకవర్గాల్లోకి మార్చడం, మరోవైపు సమీప ప్రాంతాల నుంచి కొన్ని గ్రామాలను రామగుండంలో కలపడం వంటి మార్పులు చోటుచేసుకునే అవకాశముంది. ఫలితంగా ఇప్పటివరకు ఉన్న భౌగోళిక స్వరూపం పూర్తిగా మారిపోవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.తెలంగాణలో కొత్త అసెంబ్లీ స్థానాల ఏర్పాటు జరిగితే పెద్దపల్లి జిల్లాలో కూడా అదనపు నియోజకవర్గం ఏర్పడే అవకాశాలపై చర్చ సాగుతోంది. అలాంటి పరిస్థితి ఏర్పడితే రామగుండం నియోజకవర్గం పరిధి మరింత కుదించి ప్రధానంగా కార్పొరేషన్ కేంద్రంగా ఉన్న పట్టణ ప్రాంతాలకే పరిమితం చేసే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. దీంతో సింగరేణి కార్మిక కాలనీలు, పారిశ్రామిక ప్రాంతాలు, వ్యాపార వర్గాలు, ఉద్యోగులు, మధ్యతరగతి కుటుంబాల ఓటు ప్రభావం మరింత పెరిగే అవకాశముంది.డీలిమిటేషన్ ప్రభావం కేవలం భౌగోళిక సరిహద్దులకే పరిమితం కాదని, రాజకీయ సమీకరణాలపై కూడా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటి వరకు గ్రామీణ ఓటు బ్యాంకు కీలకంగా ఉన్న ప్రాంతాల్లో పట్టణ ఓటర్లు ఆధిపత్యం సాధిస్తే రాజకీయ పార్టీల అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలు, ఎన్నికల హామీలు కూడా మారనున్నాయి. సింగరేణి కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ రంగ ఉద్యోగులు, యువత, మహిళలు, కొత్తగా స్థిరపడిన పట్టణ కుటుంబాల అవసరాలు ప్రధాన ఎన్నికల అంశాలుగా మారే అవకాశం ఉంది.మరోవైపు మహిళలకు 33 శాతం రాజకీయ రిజర్వేషన్ అమలులోకి వస్తే రామగుండం నియోజకవర్గం కూడా భవిష్యత్తులో మహిళలకు రిజర్వ్ అయ్యే అవకాశాలను పూర్తిగా తోసిపుచ్చలేమని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. అలాంటి పరిస్థితి ఏర్పడితే స్థానిక రాజకీయాల్లో కొత్త నాయకత్వానికి అవకాశం లభించే అవకాశం ఉంది. సంప్రదాయ రాజకీయ కుటుంబాలతో పాటు మహిళా నాయకత్వం, యువ నాయకులకు కూడా ప్రాధాన్యం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.అయితే డీలిమిటేషన్‌పై కేంద్ర ప్రభుత్వం ఇంకా అధికారికంగా తుది రూపురేఖలు ప్రకటించలేదు. తుది కమిషన్ సిఫార్సులు, జనాభా లెక్కలు, పరిపాలనా అవసరాల ఆధారంగానే సరిహద్దులు ఖరారయ్యే అవకాశం ఉంది. అయినప్పటికీ పారిశ్రామిక నగరంగా వేగంగా విస్తరిస్తున్న రామగుండం భవిష్యత్తులో పూర్తిస్థాయి పట్టణ నియోజకవర్గంగా రూపాంతరం చెందే అవకాశాలపై ఇప్పటికే రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. డీలిమిటేషన్ అమలైతే రామగుండం రాజకీయ సమీకరణాలు, ఓటర్ల ముఖచిత్రం, ఎన్నికల వ్యూహాలు కొత్త దిశగా మారడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



సిరిసిల్లలో మళ్లీ
ఫుడ్ పాయిజన్ కలకలం

బకాసుర రెస్టారెంట్‌లో బిర్యానీ తిని నలుగురు
యువకులకు అస్వస్థత.. ఆసుపత్రి పాలైన బాధితులు..
తనిఖీలు కరువయ్యాయంటున్న స్థానికులు

సిరిసిల్ల అర్బన్, ప్రభాత వార్త:రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మరోసారి ఫుడ్ పాయిజన్ ఘటన కలకలం రేపింది. పట్టణంలోని ఖిబకాసురఖి రెస్టారెంట్‌లో మండి బిర్యానీ తిన్న నలుగురు యువకులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బిర్యానీ ఆరగించిన కొద్దిసేపటికే వీరంతా వాంతులు, విరేచనాలతో కుప్పకూలారు. గమనించిన స్థానికులు వెంటనే వారిని వైద్యం నిమిత్తం తరలించారు. బాధితుల్లో ఒకరి పరిస్థితి తీవ్రంగా ఉండటంతో హుటాహుటిన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన ముగ్గురు యువకులకు సమీపంలోని ఆర్ఎంపీ వైద్యుడి వద్ద ప్రాథమిక చికిత్స అందించారు. కలుషిత ఆహారం తీసుకోవడం వల్లే వీరికి ఫుడ్ పాయిజన్ అయినట్లు వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించారు. సకాలంలో వైద్యం అందడంతో, ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడి పరిస్థితి నిలకడగానే ఉందని డాక్టర్లు వెల్లడించారు. ఇటీవల కాలంలో సిరిసిల్ల జిల్లాలో వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు వెలుగుచూస్తుండటంపై ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వ్యాపారులు లాభాపేక్షతో నిల్వ ఉంచిన, నాణ్యత లేని ఆహారాన్ని విక్రయిస్తున్నా.. హోటళ్లు, రెస్టారెంట్లను పర్యవేక్షించాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు నామమాత్రంగానే వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టి కలుషితాహారం విక్రయించే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అంబేద్కర్ భవనానికి నిధులు ఇవ్వండి

మంత్రి అడ్లూరి కలిసిన కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్
దళిత బంధు గ్రౌండింగ్ వేగవంతం చేయాలని విజ్ఞప్తి..
సంక్షేమ పాఠశాలలకు నిధుల కేటాయింపుపైనా వినతి

జమ్మికుంట/హుజూరాబాద్, ప్రభాతవార్త: హుజూరాబాద్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న దళిత సంక్షేమ అంశాల పరిష్కారంపై కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ దృష్టికి తీసుకెళ్లారు. హుజూరాబాద్ పట్టణంలో ఎన్నో ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న అంబేద్కర్ భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయడంతో పాటు, దళిత బంధు పథకం అమలును వేగవంతం చేసి అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వొడితల ప్రణవ్.. హుజూరాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి పరిపాలనా అనుమతులు ఇచ్చి పనులు ప్రారంభించినప్పటికీ, పూర్తి స్థాయి నిధులు విడుదల కాకపోవడంతో నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయిందని వివరించారు. దీంతో దళిత సంఘాలు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు ఎన్నోసార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు.ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో, హుజూరాబాద్ అంబేద్కర్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయడానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ప్రణవ్ తెలిపారు. దళిత బంధు గ్రౌండింగ్ పూర్తి చేయాలినియోజకవర్గంలో దళిత బంధు పథకానికి ఎంపికైన పలువురు లబ్ధిదారులకు ఇప్పటికీ గ్రౌండింగ్ ప్రక్రియ పూర్తికాకపోవడంతో ఆర్థిక ప్రయోజనం అందడం లేదని ప్రణవ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే ఎంపికైన లబ్ధిదారుల వివరాలను పరిశీలించి, గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేసి వీలైనంత త్వరగా నిధులు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.దీనిపై స్పందించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ .. దళిత బంధు అమలుపై ఇప్పటికే శాఖాపరంగా పలుమార్లు సమీక్షలు నిర్వహించినట్లు, పెండింగ్ అంశాలను త్వరలోనే పరిష్కరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నట్లు తెలిసింది.

కోరుట్లలో మార్పు కోసమే
నా పోరాటం...

కవితమ్మ నాయకత్వమే ప్రజలకు భరోసా..!
నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, సామాజిక కార్యకర్త డాక్టర్ రఘు

ప్రభాతవార్త, మెట్‌పల్లి డివిజన్ : కోరుట్ల నియోజకవర్గ రాజకీయాల్లో సంచలనం. గత 20 ఏళ్లుగా ప్రజాసేవలో ఉన్న డాక్టర్ రఘు తాజాగా తెలంగాణ రక్షణ సమితిలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 19న పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కల్వకుంట్ల కవితమ్మ ఆధ్వర్యంలో అధికారికంగా చేరనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా "ప్రభాతవార్త"తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు.

ప్రశ్న: డాక్టర్ , గతంలో బీజేపీలో సీనియర్ నేతగా ఉన్నారు. ఇప్పుడు పార్టీని ఎందుకు వీడాల్సి వచ్చింది?

జవాబు: చూడండి, రాజకీయం అంటే ప్రజాసేవ. నేను గత 20 సంవత్సరాలుగా నా జీవితాన్ని ప్రజలకు అంకితం చేశాను. అహర్నిశలు కష్టపడ్డాను. బీజేపీ నాపై ఉంచిన నమ్మకానికి ఎప్పటికీ రుణపడి ఉంటాను. కానీ కుటుంబంలాంటి పార్టీలో ఉంటూనే కొన్ని పరిస్థితులు మన చేతుల్లో లేవు. ముఖ్యంగా పార్లమెంట్ సెగ్మెంట్ స్థాయిలో కార్యకర్తల మాట వినే పరిస్థితి లేకుండా పోయింది. పార్టీ జాతీయ నాయకత్వం వల్ల నాకు ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ గ్రౌండ్ లెవెల్‌లో పని చేసే కార్యకర్తలకు గుర్తింపు, గౌరవం లేకపోతే ఎలా? అందుకే మనసు ఒప్పుకోలేదు. నా వెంట నడిచిన ఒక్క కార్యకర్తకూ ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నాను.

ప్రశ్న: తెలంగాణ రక్షణ సమితిని ఎందుకు ఎంచుకున్నారు? కవితమ్మ పై మీకున్న నమ్మకం ఏంటి?

జవాబు: ఈ రాష్ట్రంలో సామాజిక న్యాయం గురించి మాట్లాడే నాయకులు చాలా తక్కువ. కవితమ్మ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల కోసం నిరంతరం పోరాడుతున్నారు. ఆమె నాయకత్వంలో ఒక స్పష్టమైన విజన్ ఉంది. "రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కవితమ్మ నే కింగ్ మేకర్" అని నేను గట్టిగా నమ్ముతున్నాను. ఎందుకంటే ప్రజలు ఆమె వైపు చూస్తున్నారు. అణగారిన వర్గాలకు ఆమె ఇచ్చే భరోసా వేరు. అందుకే ఈనెల 19న కవితమ్మ ఆధ్వర్యంలో తెలంగాణ రక్షణ సమితిలో చేరుతున్నాను.

ప్రశ్న: కోరుట్ల అసెంబ్లీ నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. దీనిపై మీ క్లారిటీ ఏంటి?



జవాబు: అవును, 100 స్పష్టంగా చెప్తున్నాను. ఈసారి ఆత్మవిశ్వాసంతో, స్వేచ్ఛాయుత వాతావరణంలో, పూర్తి కమిట్మెంట్ తో కోరుట్ల అసెంబ్లీ బరిలో దిగుతున్నాను. గత 20 ఏళ్లుగా నేను చేసిన సేవనే నా రాజకీయ బలం. మెట్‌పల్లి మున్సిపల్‌లో బీజేపీ జెండా ఎగరేయడానికి ప్రతి కార్యకర్త ఎంత కష్టపడ్డాడో అందరికీ తెలుసు. అదే స్ఫూర్తితో ఇప్పుడు కోరుట్లలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలందరి మద్దతుతో ముందుకు వెళ్తాను.

ప్రశ్న: మీ రాజకీయ బలం ఏంటి? ప్రత్యర్థులను ఎలా ఎదుర్కొంటారు?

జవాబు: నాకు రాజకీయాల్లో ఎలాంటి గాడ్‌ఫాదర్ లేడు. ప్రజలే నా గాడ్‌ఫాదర్. ప్రజల ప్రేమ, విశ్వాసం, మద్దతు ఉన్నంతకాలం ఎలాంటి కుట్రలు, మోసాలు పనిచేయవు. నేను డబ్బు కోసం రాజకీయాల్లోకి రాలేదు. నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వేలాది మందికి సేవ చేశాను. ఆ రుణం తీర్చుకోవడానికే ఈ రాజకీయం. ప్రత్యర్థులు ఎవరైనా సరే, ప్రజల తీర్పే ఫైనల్.

ప్రశ్న: కోరుట్ల నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు ఏంటి? గెలిస్తే మీ ప్రాధాన్యతలు ఏంటి?

జవాబు: కోరుట్లలో 3 ప్రధాన సమస్యలు ఉన్నాయి. నిరుద్యోగం: యువతకు ఉపాధి అవకాశాలు లేవు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు తెస్తాను. ఆరోగ్యం: ప్రతి మండలంలో మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పిస్తాను. నా వైద్య అనుభవం ఇక్కడ ఉపయోగపడుతుంది. విద్య: పేద విద్యార్థులకు ఉచిత కోచింగ్, స్కాలర్‌షిప్‌లు ఇస్తాను. ఇవే కాకుండా రైతులకు, చేనేత కార్మికులకు ప్రత్యేక పథకాలు తీసుకురావడం నా లక్ష్యం.

ప్రశ్న: కార్యకర్తలకు, ప్రజలకు మీ చివరి సందేశం ఏంటి?

జవాబు: రాజకీయంగా మన మార్గాలు వేరు కావచ్చు. కానీ నా అనుబంధం ప్రజలతో, కార్యకర్తలతో ఎప్పటికీ కొనసాగుతుంది. నన్ను ఆదరించిన కోరుట్ల ప్రజలకు, బీజేపీ కార్యకర్తలకు, పార్టీ అభిమానులకు హృదయపూర్వక ధన్యవాదాలు. ఇప్పుడు కొత్త ప్రయాణం మొదలు. ప్రజల ఆశీర్వాదంతో కోరుట్లలో మార్పు తీసుకువస్తాను. మనందరం కలిసి కవితమ్మ నాయకత్వంలో తెలంగాణను మరింత బలోపేతం చేద్దాం ఈనెల 19న మెట్‌పల్లిలో జరిగే చేరిక కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, వివిధ సామాజిక వర్గాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొననున్నారని డాక్టర్ రఘు తెలిపారు.

తెలంగాణకు ఖేలో ఇండియా గేమ్స్ రావడం గర్వకారణం

రాష్ట్ర యువతకు సువర్ణావకాశం

ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్

సుల్తానాబాద్,ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్రానికి 8వ ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణ బాధ్యతలు రావడం ప్రతి తెలంగాణ వాసికి గర్వకారణమని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్ అన్నారు. ఈ సందర్భంగా సుల్తానాబాద్‌లోనీ ఖేలో ఇండియా సెంటర్ ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనే ప్రతిష్ఠాత్మక క్రీడా పోటీలైన ఖేలో ఇండియా గేమ్స్ తెలంగాణలో జరగడం రాష్ట్ర యువతకు తమ ప్రతిభను జాతీయ స్థాయిలో చాటుకునే అరుదైన అవకాశమని పేర్కొన్నారు. ప్రభుత్వం క్రీడలకు మరింత ప్రాధాన్యతనిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, ఆధునిక శిక్షణా కేంద్రాలు, క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని కోరారు. క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తే తెలంగాణ నుంచి మరింత మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు వెలుగులోకి వస్తారని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు



రవీందర్, ఖేలో ఇండియా ఖోఖో కోచ్ గెల్లు మధుకర్ యాదవ్, సుల్తానాబాద్ మండల ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ప్రణయ్, పీడీ వెంకటేష్, సీనియర్ క్రీడాకారులు ముస్తఫా, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణలో క్రీడల అభివృద్ధికి అందరూ సమిష్టిగా కృషి చేస్తామని, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి జాతీయ స్థాయికి తీర్చిదిద్దేందుకు కట్టుబడి పనిచేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

సాగునీటి ఎద్దడి నివారణకు ఎల్లంపల్లి ప్రాజెక్టును నింపాలి

బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి

చిరుమల్ల రాకేష్ కుమార్ డిమాండ్

ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టకపోతే

తాగునీటి సమస్య తప్పదని హెచ్చరిక

పెద్దపల్లి, ప్రభాతవార్త:

సాగునీటి ఎద్దడి నివారణకు ఎల్లంపల్లి ప్రాజెక్టును నింపాలి అని బీ ఆర్ ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి చిరుమల్ల రాకేష్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం పెద్దపల్లి బస్టాండ్ దగ్గర గల ప్రెస్ క్లబ్ లో బీ ఆర్ ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి చిరుమల్ల రాకేష్ కుమార్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుమల్ల రాకేష్ కుమార్ మాట్లాడుతూ ఉత్తర తెలంగాణలో సాగునీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చుతోందని, ఎండిపోయిన చెరువులను నింపేందుకు ప్రభుత్వం తక్షణమే కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంపులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దపల్లి ప్రాంతంలో ఎల్లమ్మ చెరువు సహా అనేక చెరువులు పూర్తిగా ఎండిపోవడంతో రైతులు నాట్లు వేయలేక అల్లాడుతున్నారని పేర్కొన్నారు. డీ 83, డీ 86 కాలువల ద్వారా నీటి సరఫరా నిలిచిపోవడంతో సాగునీటి సమస్య జఠిలమైందన్నారు. గత ఏడాది ఇదే సమయానికి జిల్లాలో 2.79 లక్షల ఎకరాల్లో సాగు జరగగా, ఈసారి కేవలం 12 వేల ఎకరాలకు మాత్రమే పరిమితమైందని గణాంకాలను వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారం కంటే



బీఆరఎస్ నాయకులను విమర్శించడానికే ప్రాధాన్యత ఇస్తోందని మండిపడ్డారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు సామర్థం 20 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 7 టీఎంసీల నీరు మాత్రమే ఉందని వెల్లడించారు. తాగునీటి అవసరాలు, ఎన్టీపీసీ అవసరాలను దృష్టిలో ఉంచుకుంటే, సాగునీటికి తీవ్ర కొరత తప్పదని హెచ్చరించారు. గోదావరిలో నీటి ప్రవాహం తగ్గిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో, ప్రభుత్వం అత్యవసరంగా చర్యలు చేపట్టి శ్రీపాద ఎల్లంపల్లిని నింపి, ఆ నీటిని చెరువులకు తరలించాలని కోరారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయ శాఖ అధికారులు ఆరుతడి పంటలు వేయాలని సూచిస్తున్నారని, ఇది రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి ఎద్దడికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆరఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్, మాజీ వైస్ చైర్మన్ మోబిన్, మాజీ కౌన్సిలర్ స్వామి, ఉప సర్పంచ్ మేకల కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు కర్రె దేవేందర్ రెడ్డి, పడాల సతీష్, పోసాని శ్రీనివాస్ యాదవ్, ఉప్పు శివ కుమార్, బోయిని మనోజ్, కంచి నాగరాజ్, పాయిలి కిరణ్ పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

-నిండు ప్రాణానికి ముప్పు

-వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగిలి తలకు తీవ్ర గాయాలు

-విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

-నిండు ప్రాణానికి ముప్పు

తిమ్మాపూర్, ప్రభాత వార్త :



విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ఓ నిండు ప్రాణం ప్రమాదం లో చిక్కిన ఘోర సంఘటన ప్రతి ఒక్కరి హృదయాలను కదిలించింది. వివరాల్లోకి వెళితే కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామానికి చెందిన మానుపాటి రమేష్ వయస్సు 35 కూలీ తండ్రి లచ్చయ్య రోజు లాగే ఉదయం కొత్తకుంట పోరండ్ల లో బహిర్భూమికి వెళ్లగా విద్యుత్ వైర్లు తగిలి షాక్ కొట్టడం తో రమేష్ తల వెంట్రుకలు పూర్తిగా కాలిపోయి తీవ్రంగా గాయం అయ్యి రక్తంతో ఆపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. అది గమనించిన భార్య ప్రియాంక 108 కి ఫోన్ చేసి అంబులెన్స్ లో చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటం తో సితార హాస్పిటల్ తెలించారు. ప్రియాంక ఫిర్యాదు మేరకు ఎల్ యం. డి పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకొని వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త :మనస్తాపం చెంది ఉరివేసుకొని ఓ వ్యక్తి మరణించినట్లు ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం యామపూర్ గ్రామానికి చెందిన బాస బుచ్చన్న గత కొంతకాలంగా మద్యం తాగుడుకు బాని సై బుధవారం రాత్రి 11 గంటల సమయంలో మృతుడి భార్య అయిన బాస లక్షి మ్మ మద్యం తాగడం మానేయమని మందలించగా దానికి మనస్థాపం చెందిన మృతుడు మృతుడి ఇంటి బయట గల బాత్రూంలోని ఇనుప పట్టికి చీరతో ఊరికి పెట్టుకొని మరణించినట్లు పోలీసులు తెలిపారు. అతని తండ్రి మృతిపై ఎవరిపై ఎలాంటి అనుమానం లేదని మృతుడి కొడుకు బాస రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ ఐ తెలిపారు.

కరెంట్ షాక్‌తో గేదె మృతి

తిమ్మాపూర్,జూలై 16,ప్రభాతవార్త : కరీంనగర్ జిల్లా తిమ్మాపూ ర్ మండలం పొరండ్ల గ్రామా నికి చెందిన రైతు చింతల రమణారెడ్డికి చెందిన పాలి చ్చే గేదె(మూర్రాజాతి)విద్యుత్ షాక్ తో మృతి చెంది నట్లు గ్రామస్తులు తెలిపా రు. గురువారం రమణ రెడ్డి అనే రైతు తన వ్యవసాయ పొలాల సమీపంలో గేదెల ను మేపుతుండగా సమీపం లో 25 కే.వి ట్రాన్స్ఫార్మర్ వద్ద గేదె మేస్తుండగా ట్రా న్స్ఫార్మర్ ఫేస్ వైర్ తగిలి అక్కడి కక్కడే మృతి చెం దింది. అధికారుల నిరక్ష్యం...విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ట్రాన్స్ఫార్మర్ ఏర్పా ట్లులో నిబంధనలు ఉల్లం ఘించి ట్రాన్స్ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయక పోవడం,ట్రాన్స్ఫార్మర్ గద్దె కూడా చాలా కిందికి ఏర్పా టు చేసి,నిరక్ష్యంగా వ్యవహ రించి నందునే ప్రమాదం సంభవించిందని బాధిత రైతు ఆరోపించారు. ఇప్పటి కైనా విద్యుత్ శాఖ అధికా రులు స్పందించి, ట్రాన్స్ఫా ర్మర్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పా టుతో పాటు ట్రాన్స్ఫార్మర్ గద్దె మరింత ఎత్తు పెంచి ఏర్పా టు చేయాలని డి మాండ్ చేశారు. గేదె మృతి తో బాధిత రైతుకు సుమారు రూ.1,20, 000/(లక్ష ఇరవై వేల రూపాయలు) నష్టం వాటిల్లిందని,నష్ట పోయిన పేద రైతుకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.

నేరాలు-దారుణాలు

గడ్డి మందు సేవించి వ్యక్తి ఆత్మహత్య

కోరుట్ల, ప్రభాతవార్త :



పట్టణంలోని అల్లమయ్య గుట్ట కాలనికి చెందిన బాజా చిన్న రాజయ్య (42) గడ్డి మందు సేవించి గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజయ్య కూలి పని చేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రాజయ్య ప్రస్తుతం హైదరాబాదులోనీ ఓ ఆసుపత్రిలో కిడ్నీ డయాలసిస్ చికిత్స చేయించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక పరిస్థితులు సరిగా లేక మానసికంగా కృంగిపోయాడు. కాలనీకి సమీపంలో ఉన్న పొలంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడికి భార్య లక్ష్మీ , ముగ్గురు కూతుళ్లు,ఒక కొడుకు ఉన్నారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కోరుట్ల పట్టణంలో విషాదం

బైక్ ను ఢీ కొన్న హిందూస్తాన్ పెట్రోల్ ట్యాంకర్

13ఏండ్ల బాలుడి మృతి

కోరుట్ల, ప్రభాతవార్త :



అతివేగం, నిరక్ష్య ాన్ల వెరసి 13 సంవత్సరాల బాలుడి మృతితో కోరుట్లలో విషాదం చోటుచేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని బాలాజీ రోడ్డుకు చెందిన మగ్గిడి రవీందర్ సుమ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరి చిన్న కుమారుడు జస్వంత్ (13) పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం వరుసకు అన్న అయిన చాణక్యతో కలిసి ద్విచక్ర వాహనంపై కోరుట్ల కొత్త బస్టాండ్ కు పనిమీద వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్తుండగా రహదారిపై మూలమలిగేందుకు ద్విచక్ర వాహనంపై వేచి ఉన్నారు. అదే సమయంలో కోరుట్ల నుంచి వేములవాడ వైపు వస్తున్న డీజిల్ ట్యాంకర్ వేగంగా వచ్చి వెనకనుంచి వచ్చి ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ వెనుక కూర్చున్న జస్వంత్ కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, చాణక్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు జస్వంత్ ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన ఫలితం లేకుండా పోయింది. జస్వంత్ మృతితో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి తండ్రి రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నెత్తురోడిన రహదారి

బైక్‌ను ఢీ కొట్టిన కారు

యువకుడు మృతి.. మరో యువకుడికి తీవ్ర గాయాలు

చందుర్తి / ప్రభాతవార్త



చందుర్తి మండలం ఎన్గల్ గ్రామ శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయాల పాల య్యాడు, చందుర్తి ఎస్సై రమేష్ కథనం ప్రకారం కోనరావుపేట మండలం బావు సాయిపేట గ్రామానికి చెందిన వడ్నాల రాజు(17) చందుర్తి మండలం జలపతి తాండకు చెందిన భూక్య ఆకాష్ అనే యువకులు వేములవాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువు వీరిద్దరూ కోనరావుపేట మండలం బావుసాయి పేట లోని రాజు అమ్మమ్మ ఇంటికి వెళ్తున్నారు. మార్గమధ్యలో చందుర్తి మండలం ఎన్గల్ గ్రామ శివారులో సిరికొండ మండలం తాటిపల్లి గ్రామం చెందిన కారు వేములవాడ వైపు వస్తుండగా బైక్ ను ఢీ కొట్టింది. ఈ సంఘటనలో రాజు అక్కడికక్కడే మృతిచెందగా, భూక్య ఆకాష్ తలకు తీవ్ర గాయాలు కాగా కరీంనగర్ లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై మృతిని తల్లి వడ్నాల రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు. రోడ్డు ప్రమాదంతో రక్తం రహదారిపై ఏరులై పారింది. రోడ్డు ప్రమాదం జరిగిన స్థలాన్ని గురువారం సాయంత్రం వేములవాడ డిఎస్పి శ్రీనివాసులు సందర్శించారు, రోడ్డు ప్రమాదానికి గల కారణాలను ఎస్ఐ రమేష్ ను అడిగి తెలుసుకున్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని డిఎస్పి సూచించారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి

కోరుట్ల, ప్రభాతవార్త :



విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఆయన పరిశీలించారు. సందర్భంగా కళాశాల రికార్డులను తనిఖీ చేశారు. విద్యా, పరిపాలనా కార్యకలాపాలను సమీక్షి ంచారు. బోధనా నాణ్యతను మెరుగుపరుచుకోవడానికి తరగతి గది బోధనలో ఇంటిగ్రేటెడ్ ఫ్లాట్ ప్యానెల్స్ ను సమర్థవంతంగా వినియోగించుకోవాలని అధ్యాపకులకు సూచించారు. అనంతరం జిల్లా విద్యాధికారిని అధ్యాపకులు సత్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ గౌసర్ రెహ్మాన్ , అధ్యాపకులు గంగాప్రసాద్, డింగరి ప్రశాంత్ నటరాజ్, హబీబ్, శ్రీనివాస్, మొయిజ్, ఇమ్రాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

తీజ్ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

భీమారం, ప్రభాతవార్త:



వేములవాడ నియోజకవర్గ పరిధిలోని భీమారం మండలంలోని రాజలింగంపేట గ్రామంలో ఘనంగా నిర్వహించిన గిరిజనుల సంప్రదాయ తీజ్ పండుగ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా గిరిజన మహిళలు, యువతులతో కలిసి సంప్రదాయబద్ధంగా తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన వారికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. గిరిజనుల ఆచారాలు, సంస్కృతి, సంప్రదాయాలు సమాజానికి గొప్ప వారసత్వమని, వాటిని



భావితరాలకు అందేలా పరిరక్షి ంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ విద్య, ఉపాధి, మౌలిక వసతులు, సంక్షేమ రంగాల్లో పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. గిరిజనుల జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ఈ వేడుకల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని తీజ్ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

మాయ మాటలు చెప్పి బంగారం చోరి

కోరుట్ల, ప్రభాతవార్త :

మాయ మాటలు చెప్పి సుమారు 2తులాల బంగారం చోరీ చేసిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం కోరుట్ల బస్టాండ్ వద్ద సిరికొండ గ్రామానికి చెందిన అల్లే బకీర్త 80 సంవత్సరాల వృద్ధురాలిని తన ఒంటిపై ఉన్న బంగారాన్ని చూసి గుర్తు తెలియని వ్యక్తి తన దగ్గరికి వచ్చి, పెద్దమ్మ నీకు 4000/ పెన్షన్ వస్తుందా, రాకుంటే నాతో బ్యాంకుకు రా నీకు పెన్షన్ ఇప్పిస్తావని మాయ మాటలు చెప్పి ఆ వృద్ధురాలిని తన వెంట కోరుట్ల లోని ఎస్బిఐ మెయిన్ బ్రాంచ్ వద్దకి తీసుకొని వెళ్లి, నేను బ్యాంకు మేనేజర్ తో మాట్లాడి వస్తా అని చెప్పి మళ్ళీ తిరిగి వచ్చి నీ ఒంటిపైన నా బంగారు ఆభరణాలు ఉంటే నీకు పెన్షన్ ఇవ్వరు అని చెప్పి ఆ వృద్ధురాలు పైన ఉన్న సుమారు రెండు తులాల బంగారు హారాన్ని తీసుకొని తన వద్ద పెట్టుకొని అప్లికేషన్ ఫామ్ తీసుకొని వస్తా అని చెప్పి అక్కడి నుండి తప్పించుకొని వెళ్ళిపోయాడు. ఈ విషయంపై బాధితురాలు అల్లే బకీర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతి గుర్తు తెలియని వ్యక్తి పైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు .

పిడిఎస్ రైస్ పట్టివేత

కోరుట్ల, ప్రభాతవార్త :

కోరుట్ల పట్టణంలోని ఎకిన్పూర్ వద్ద వాహన తనిఖీల్లో భాగంగా అక్రమంగా తరలిస్తున్న పిడిఎఫ్ రైస్ ని పట్టుకున్నట్టు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం ఎకిన్పూర్ వద్ద వాహనాల్లో తనిఖీల్లో భాగంగా ఒక అశోక్ లేలాండ్ వాహనంలో అక్రమంగా 30 క్వింటాళ్ల పిడిఎఫ్ రైస్ ను రుద్రంగి నుండి నిజామాబాద్ కి తరలిస్తుండగా అట్టి వాహనాన్ని పట్టుకొని ఆ వాహనం రైస్ యజమాని సుల్తాను సురేష్ రుద్రంగి గ్రామానికి చెందిన వ్యక్తి పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

తల్లిని కోల్పోయిన నలుగురు బాలికలకు భరోసానిచ్చిన ఎమ్మెల్యే సత్యం

మల్యాల/ ప్రభాతవార్త



మల్యాల మండలం తక్కలపల్లి గ్రామంలో తండ్రి దుబాయ్ లో ఉండగా అనారోగ్యంతో తల్లిని కూడా కోల్పోయిన నలుగురు బాలికల విషాదంతాన్ని తెలుసుకున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం రాత్రి సంబంధిత మృతురాలి ఇంటికి వెళ్లి పార్థివ దేహానికి నివాళులర్పించి వారి కూతుళ్లను ఓదార్చారు, ఈ సంఘటన గ్రామంలో విషాదం నెలకొల్పగా, ఊట్కూరి కనకయ్య కు చెందిన ఆ నలుగురు కుమార్తెలకు తాను అండగా ఉంటానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం వారికి భరోసా ఇచ్చారు, అంతేకాకుండా అంత్యక్రియల నిమిత్తం పదివేల రూపాయల నగదును కూడా అందజేశారు,

దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టి బాధితులకు న్యాయం చేయాలి

ఆల్ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధి

పాటకుల మహేష్ డిమాండ్

పెద్దపల్లి, ప్రభాతవార్త:

దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టి బాధితులకు న్యాయం చేయాలి అని ఆల్ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధి పాటకుల మహేష్ డిమాండ్ చేశారు. గురువారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో పాటకుల మహేష్ ఆధ్వర్యంలో ఆల్ సంఘాల ఐక్యవేదిక తరపున కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పాటకుల మహేష్ మాట్లాడుతూ జిల్లాలో దళితులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఈ నెల 18వ తేదీ శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో పాటు కమిషన్ బృందం నిర్వహించే సమావేశంలో ప్రస్తావించనున్న అంశాలను వివరించారు. పెద్దపల్లి జిల్లాలో దళితులపై జరుగుతున్న దాడులు, ఆలయ ప్రవేశానికి అడ్డంకులు, భూ వివాదాలు, కుల బహిష్కరణలు, హత్య కేసులు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తులో పోలీసు, రెవెన్యూ అధికారులు నిరక్ష ్యంగా వ్యవహరిస్తున్న అంశాలను కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులకు కమిషన్ ఆదేశాలు జారీ చేసి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి బాధితులు, వివిధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆది జాంబవంతు అరుంధతి సంఘం రాష్ట్ర ప్రతినిధి కోటగిరి పాపయ్య, తాండ్ర సదానందం, బొంకూరి సుభాష్, బోసెల్లి మహేష్, మద్దెల రాజన్న పాల్గొన్నారు.



కోరుట్ల వార్త



శాసన సభ్యులు సంజయ్ ని సన్మానించిన మాజీ మార్క్ ఫెడ్ చైర్మన్

కథలాపూర్ ప్రభాతవార్త,



మండల కేంద్రం మీదగా గురువారం హైదరాబాద్ వెళుతున్న కోరుట్ల లీలిత సంజయ్ వారిని మాజీ మార్క్ఫెడ్ చైర్మన్ లోకబాపురెడ్డి శాలువాతో సత్కారించారు అనంతరం ఎమ్మెల్యే సంజయ్,లోక బాపు రెడ్డిలు బి ఆర్ ఎస్ కార్యకర్తలతో తెనిటీ విందులో పాల్గొ న్నరు వీరి వెంట మండల నాయకులు కథలుపూర్ మండల మార్కె ట్ కమిటీ మాజీ చైర్మన్ వర్ధినేని నాగేశ్వర్ రావు, మాజీ మండ లకో ఆప్షన్ సభ్యులు ఎండీ. రఫీ, మండల బి ఆర్ ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు కల్లెడ శంకర్, రొక్కం తిరుపతి, అల్లే సంతోష్, నల్ల గంగారెడ్డి పాల్గొన్నారు

జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతనంగా ఎన్నికైన ప్రధాన కార్యదర్శి, కార్యదర్శి లకు ఘన సన్మానం

కథలాపూర్ ప్రభాతవార్త,

జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గా నియమితులైన సందర్భంగా కాయితి నాగరాజ్, అలాగే జిల్లా కార్యదర్శిగా నియమితులైన ధనుంజయ రెడ్డిలకు కథలాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం శాలువా తో ఘనంగా సత్కరించారు, ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ పుండ్ర నారాయణరెడ్డి, వైస్ చైర్మన్ పులి శిరీష హరిప్రసాద్, మాట్లాడుతూ ప్రస్తుతం కథలాపూర్ మండల అధ్యక్ష పదవి లో కొనసాగుతున్న కాయితి నాగరాజ్ ను జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గా, ధనుంజయ రెడ్డి ని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా నియమించడం చాలా సంతోష కరమని వారి ఇరువురు కూడా పార్టీకి వెన్నుదన్నుగా ఉంటూ మండల అధ్యక్ష పదవిలో ఉన్న కాయితి నాగరాజ్ అహర్నిశలు పార్టీ తనకు ఇచ్చినటువంటి బాధ్యతలను అలాగే పార్టీ కట్టుబాట్లను విస్మరించకుండా స్థానికంగా ఎన్నో పార్టీ కార్యక్రమాలను నిర్వహించాడని చిన్న పెద్ద తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరిని కలుపుకొని పోయే స్వభావం కలవాలని అన్నారు, అలాగే ధనుంజయ రెడ్డి పార్టీ కట్టుబాట్లకు లోబడి ఉండి పార్టీలో తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు, వారి ఇరువురు కూడా మన కథలాపూర్ మండలం నుండి జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, కార్యదర్శిగా ఎన్నిక కావడం అన్నది మనందరికీ చాలా గర్వకారణం అని తెలిపారు, అలాగే వారు మాట్లాడుతూ ఇలాంటి మంచి అవకాశాన్ని కథలాపూర్ మండల లోని నాయకులకు అందించినందుకు గాను స్థానిక శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు, ఇట్టి కార్యక్రమంలో వారితోపాటు, ఏఎంసి డైరెక్టర్ ఎండీ ఆఫీస్, మండల యూత్ అధ్యక్షుడు అంబటి రాధాకృష్ణ, అంగ మహేష్, ఉట్పల్లి సర్పంచ్ పాల నవీన్,ఉప సర్పంచు ముదం శేఖర్,ఎండి మొయిద్దీన్,మాజీ ఉప సర్పంచ్ మార్కం రాజేశం ప్రకాష్,ముద్రకోలా అనిల్, కడారి శ్రీనివాస్,ఎండి ముబీన్,తిరుపతి రెడ్డి రాజేష్ నాయక్, శంకర్ గౌడ్,సతీష్ లతోపాటు పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



డిజిటలైజేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి అయ్యేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి

కలెక్టర్ కె.హరిత

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 16, ప్రభాతవార్త :

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ త్వరగా పూర్తి అయ్యే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ శత శాతం పూర్తి చేయడంలో రాజకీయ పార్టీలు తమ సహకారం అందించాలని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 76 శాతం డిజిటలైజ్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, గ్రామీణ ప్రాంతాలలో ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని, పట్టణ ప్రాంతాలపై రాజకీయ పార్టీల



ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి పూరించిన ఎన్యుమరేషన్ ఫారాలను బూత్ స్థాయి అధికారులకు అందే విధంగా చొరవ తీసుకోవాలని తెలిపారు. భారత ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గడువును ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని, కానీ ప్రక్రియ ముందే పూర్తి చేసే విధంగా రాజకీయ పార్టీలు కృషి చేయాలని తెలిపారు. ఎఎస్డి. ఓటర్ల జాబితా, రేషనలైజేషన్ ప్రక్రియ వెంటనే చేపట్టడం జరుగుతుందని, మ్యాపింగ్ కాని వారిని గుర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలుగు భాషను మన సంస్కృతిగా భావించి విద్యార్థులకు బోధించాలి

మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

మంచిర్యాల, జూలై 16, ప్రభాతవార్త

తెలుగు భాషను మన సంస్కృతిగా భావించి విద్యార్థులకు బోధించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు భాషా శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు భాషను కేవలం ఒక పాఠ్యాంశంగా కాకుండా మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా భావించి విద్యార్థులకు బోధించాలని తెలుగు భాష ఉపాధ్యాయులకు సూచించారు. శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న వినూత్న బోధనా పద్ధతులను పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థులలో తెలుగు భాషపై ఆసక్తి, అభిరుచిని పెంపొందించాలని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో ఇతర భాషల ప్రభావం కారణంగా



విద్యార్థులకు తెలుగు భాషను సమర్థవంతంగా బోధించడం కొంత సవాలుగా మారిందని, ఈ పరిస్థితిని అధిగమించేందుకు తెలుగు ఉపాధ్యాయులు సృజనాత్మక బోధనా విధానాలను అవలంబించాలని తెలిపారు. ముఖ్యంగా కథలు, కవితలు, పద్యాలు, నాటికలు వంటి సాహిత్య ప్రక్రియలను ఉపయోగించి విద్యార్థులలో భాషా నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు, శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్సు కో ఆర్డినేటర్ జంబోజు సత్తయ్య, శిక్షణ కేంద్ర ఇన్‌చార్జి బోనగిరి శ్రీనివాస్, జిల్లా స్థాయి డి.ఆర్.పి.లు, తెలుగు భాష ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూముల సర్వే, రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రతినిధి:ప్రభాతవార్త:

భూముల సర్వే, రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం భైంసా మండలం బాబుల్ గావ్ గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మ్యాపులు లేని గ్రామాలకు మ్యాపులు తయారు చేసేందుకు చేపట్టిన సర్వేను పారదర్శకంగా చేపట్టాలన్నారు. రీ సర్వేకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో అత్యాధునిక సాంకేతికత వినియోగించి రీ సర్వే ప్రక్రియ చేపట్టిందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను మొత్తాన్ని గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.స్థానిక రైతులతో మాట్లాడుతూ, రైతులందరూ ఆయిల్ ఫామ్ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమతో ఎక్కువ లాభాలు వస్తాయని అన్నారు.



వాతావరణ పరిస్థితులు, నీటిలభ్యత, వర్షాలను బట్టి పంటలు సాగు చేయాలన్నారు. పంట మార్పిడి విధానాలపై దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏడి ల్యాండ్ సర్వే ల్యాండ్ రికార్డ్ నరసింహా మూర్తి, తహసిల్దార్ శశి భూషణ్, గ్రామ సర్పంచ్ అనసూయ మహేందర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో జిల్లాను అగ్రస్థానంలో ఉంచాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ ఆంజెల అల్ఫ్రెడ్

ప్రభాత వార్త కోనరావుపేట

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో రాజన్న సిరిసిల్ల జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉంచేందుకు అందరూ సమన్వయంతో పని చేయాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆంజెల అల్ఫ్రెడ్ అన్నారు. గురువారం ఆమె డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నాగేంద్రబాబు, ఇతర ప్రోగ్రామ్ అధికారులతో కలిసి కోనరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అనంతరం పీహెచ్సీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు.డ్రై డే పై అవగాహన కల్పించాలి ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పనిచేసే వైద్య సిబ్బంది, స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి ప్రతి మంగళవారం, శుక్రవారం "డ్రై డే" విధానాన్ని ప్రజలు పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. దోమల నివారణకు ఇది కీలకమని తెలిపారు.సిజేరియన్ శాతం తగ్గించాలిజిల్లాలో సిజేరియన్ కాన్పుల శాతం ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లుల సమావేశాల్లో సాధారణ ప్రసవాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని అన్నారు.



గర్భిణులు ఉన్నప్పుడే యోగా నేర్పించాలని, ముఖ్యంగా మొదటి గర్భం దాల్చిన మహిళల ఇంట్లోని పెద్దలకు నార్మల్ డెలివరీ వల్ల కలిగే లాభాలను వివరించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇచ్చే మందులను తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు.హేచ్ పీవి వ్యాక్సిన్ తీసుకోవాలివ్యాక్సిన్ ద్వారా మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం 14 సంవత్సరాలు పూర్తయి 15 సంవత్సరాల లోపు ఉన్న బాలికలకు ఈ వ్యాక్సిన్ ఇస్తున్నామని తెలిపారు. యువతులు, బాలికలు వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా భవిష్యత్ ఆరోగ్య సమస్యలను నివారించుకోవచ్చన్నారు. వ్యాక్సిన్ పై ఉన్న అపోహలను వీడి ఆరోగ్య సిబ్బంది సూచనల మేరకు ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నాగేంద్రబాబు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సంపత్, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ నయీమ్, కోనరావుపేట పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ సురేష్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు

సింగరేణి గనులు ప్రైవేటుకు కట్టబెట్టొద్దు

కొత్త బొగ్గు బ్లాకులన్నీ సింగరేణికే ఇవ్వాలి

డిమాండ్లు పరిష్కరించకుంటే ఆగస్టులో సమ్మె: ఏఐటీయూసీ

గోదావరిఖని, ప్రభాతవార్త:



సింగరేణికి కొత్త బొగ్గు గనులు దక్కకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే అడ్డంకిగా మారాయని ఏఐటీయూసీ గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఆరోపించారు. బొగ్గు బ్లాకులను ప్రైవేటు సంస్థలకు అప్పగించే విధానాన్ని విరమించి, తెలంగాణలో గుర్తించిన అన్ని కొత్త గనులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్మికుల ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం, యాజమాన్యం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే ఆగస్టు నెలలో ఇతర కార్మిక సంఘాలతో కలిసి సమ్మె చేపడతామని హెచ్చరించారు.ఆర్జీ1 ఏరియాలోని ఓసీపీ5లో గురువారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తాడిచర్ల2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించేందుకు 2012లో ఖిసేవ్ సింగరేణిఖి ఉద్యమాన్ని ఏఐటీయూసీ ప్రారంభించి, అన్ని కార్మిక సంఘాలను ఏకం చేసి పోరాటం నిర్వహించిందని గుర్తు చేశారు. అదే తరహాలో ప్రస్తుతం సింగరేణి గుర్తించిన నాలుగు బొగ్గు బ్లాకులను కూడా వేలం నుంచి తప్పించి సంస్థకే అప్పగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.2015లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎంఎండీఆర్ చట్టం కారణంగానే సింగరేణికి కొత్త గనులు దక్కడం లేదని రాజ్‌కుమార్ ఆరోపించారు. రాష్ట్రంలో లభ్యమయ్యే బొగ్గు నిల్వలను ప్రభుత్వ రంగ సంస్థకు ఇవ్వకుండా ప్రైవేటు సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల సింగరేణి భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందన్నారు. రాష్ట్రానికి 51 శాతం, కేంద్రానికి 49 శాతం వాటా ఉన్న సంస్థను పరిరక్షించాల్సి న బాధ్యత రెండు ప్రభుత్వాలపైనా ఉందని, కానీ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. సింగరేణి యాజమాన్యానికి 31 డిమాండ్లతో సమ్మె నోటీసు ఇచ్చామని, ఇప్పటికే రెండు విడతల చర్చలు జరిగినప్పటికీ స్పష్టమైన హామీలు రాలేదన్నారు. వెంటనే 12వ వేజ్ బోర్డు ఏర్పాటు చేయడం, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయడం, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి న రూ.56 వేల కోట్ల బకాయిలను విడుదల చేయడం, కార్మికుల ఆదాయపన్ను రీయింబర్స్‌మెంట్, మారుపేర్ల సమస్య పరిష్కారం, మెడికల్ బోర్డు కొనసాగింపు, సొంతింటి పథకం అమలు వంటి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.సమావేశానికి ఓసీపీ5 ప్రాజెక్టు కార్యదర్శి గుర్రం ప్రభుదాస్ అధ్యక్షత వహించగా, ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను పాల్గొన్నారు. నాయకులు మాదన మహేష్, బోగ సతీష్‌బాబు, గండి ప్రసాద్, ఎడవెల్లి రాజిరెడ్డి తదితరులు హాజరయ్యారు.

రైతులకు అవసరమైన విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయి

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:

రైతులకు అవసరమైన విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయి అని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు. గురువారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుండి విడుదల చేసిన ఒక ప్రకటనలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. జిల్లాలో ఎల్ నినో ప్రభావంపై వ్యవసాయ శాఖ నిర్వహించిన అంచనాల ప్రకారం 207 గ్రామాలు మోస్తరు ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందని, అయితే తీవ్ర ప్రభావం లేదా స్వల్ప ప్రభావం ఉన్న గ్రామాలు ఏవీ లేవని కలెక్టర్ తెలిపారు. జూలై 15 నాటికి జిల్లాలో మొత్తం 91136 ఎకరాల్లో పంటల సాగు అంచనా వేయగా, ఇందులో 10510 ఎకరాలు వర్షాధార పంటలు, 80626 ఎకరాలు సాగునీటి ఆధారిత పంటలు ఉన్నాయని తెలిపారు. ఇంకా 184671 ఎకరాల్లో సాగు చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జూలై 16 నుంచి 31 వరకు జిల్లాలో 89892 ఎకరాల్లో వివిధ పంటల సాగుకు వ్యవసాయ శాఖ కార్యాచరణ ప్రణాళిక రూపొందించిందని కలెక్టర్ తెలిపారు. ఇందులో 84500 ఎకరాల్లో వరి, 1814 ఎకరాల్లో కందులు, 1182 ఎకరాల్లో పెసల్లు, 186 ఎకరాల్లో మినుములు, 136 ఎకరాల్లో అలసందలు, 16 ఎకరాల్లో ఉలవలు, 8 ఎకరాల్లో ఆముదం, 925 ఎకరాల్లో మొక్కజొన్న, 3 ఎకరాల్లో పశుగ్రాస జొన్న, 471 ఎకరాల్లో కూరగాయలు, 651 ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేయనున్నట్లు తెలిపారు. ప్రతిపాదిత సాగుకు అవసరమైన 17259.03 క్వింటాళ్ల విత్తనాలకు గాను జిల్లాలో ఇప్పటికే 21564.44 క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్ తెలిపారు. రైతులకు విత్తనాల కొరత తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామ స్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని, తక్కువ కాలంలో దిగుబడి వచ్చే ప్రత్యామ్నాయ పంటలు, వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన పంటల సాగుపై సాంకేతిక సూచనలు అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలి

రైతు విజ్ఞాన కేంద్రం పెద్దపల్లి ప్రతినిధి ఓ.సంపత్ పిలుపు

వానాకాలం 2026 సీజన్ సాగుపై అవగాహన సదస్సు

పెద్దపల్లి, ప్రభాతవార్త:



ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలి అని రైతు విజ్ఞాన కేంద్రం పెద్దపల్లి ప్రతినిధి ఓ సంపత్ పిలుపునిచ్చారు. గురువారం పాలకుర్తి రైతు వేదికలో వానాకాలం 2026 సీజన్ పై ఎల్‌నినో దుష్ప్రభావాల గురించి వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, రైతు విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా అవగాహన సదస్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా రైతు విజ్ఞాన కేంద్రం పెద్దపల్లి ప్రతినిధి ఓ సంపత్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి శ్యాం ప్రసాద్, రామగుండం ఏఎంసీ చైర్మన్ గడ్డం తిరుపతి మాట్లాడారు. ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితి దృష్ట్యా, ఈ సీజన్ మొత్తం మంచి వర్షపాతం లేదని, తద్వారా జలాశయాలు నిండే పరిస్థితి లేదన్నారు. దీనితో కాలువల ద్వారా నీటి సరఫరా, చెరువుల ద్వారా నీరు అందించే అవకాశం లేదని, ప్రాజెక్టులలో నీరు చేరకపోవడం వల్ల బోర్లలో, బావులలో మోటర్లు ఎక్కువ రోజులు నడిచే పరిస్థితి ఉండదని వివరించారు. ఈ నేపథ్యంలో బోర్ల కింద, బావుల కింద ఎట్టి పరిస్థితిలోనూ అతి ఎక్కువ నీరు అవసరమైన వరి పంట సాగు చేయవద్దని రైతులకు స్పష్టం చేశారు. రైతులు మొత్తం విస్తీర్ణంలో వరి సాగు చేయకుండా, కొంత భాగంలో ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని, ముఖ్యంగా తక్కువ నీటితో సాగు చేయగల జొన్న, పెనలు, మినుములు, కంది, పొద్దుతిరుగుడు, నువ్వులు, సోయాబీన్, ఆముదం, రాగులు లాంటి పంటలు సాగు చేయడం మేలని సూచించారు. రైతులందరూ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి సాగును కొంత మేర తగ్గించాలని కోరారు. అనంతరం ఎస్సీ రైతులకు ఉచితంగా రాగి విత్తనాలు, 2000 రూపాయల విలువ గల ఆరుతడి పంటలకు కలుపు తీయు యంత్రాలు లేదా పీడర్లు పంపిణీ చేశారు. ఎస్టీ రైతులకు ఉచితంగా ఇంటి పెరటి కూరగాయ విత్తనాల కిట్లు అందజేశారు. ఇట్టి కార్యక్రమంలో పాలకుర్తి సర్పంచ్ పెద్దపల్లి తిరుమల, ఉద్యానవన శాఖ అధికారి ఏ జ్యోతి, హెచఈఒ బి రాము, తిరుమల ప్లాంటేషన్ ఆఫీసర్ ప్రశాంత్, ఏఈఓలు ఎం సువర్ణరేఖ, కే శ్రీకాంత్, జే సుష్మ, అధిక సంఖ్యలో సన్న చిన్నకారు ఎస్సీ రైతులు పాల్గొన్నారు.

మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:



మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి అని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. గురువారం పెద్దపల్లి కలెక్టరేట్ సమావేశ మందిరంలో యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ స్వయం ఉపాధి శిక్షణలో తొలి బ్యాచ్‌లో 1,200 మంది శిక్షణ పొందడం అభినందనీయమని తెలిపారు. తొలి బ్యాచ్ సాధించిన విజయాలు మరింత మందికి స్ఫూర్తిగా నిలిచి స్వయం ఉపాధి వైపు అడుగులు వేయడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. మహిళలు తమ ప్రతిభను, నైపుణ్యాలను పరిమితం చేసుకోకుండా సృజనాత్మకంగా ఆలోచిస్తూ కొత్త అవకాశాలను అన్వేషించాలని సూచించారు. సంప్రదాయ కోర్సులకే పరిమితం కాకుండా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న రంగాల్లో నైపుణ్యాలు పెంపొందించుకుని స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని కోరారు. మార్కెట్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని వ్యాపారాలు ప్రారంభించాలని, ఇద్దరు లేక ముగ్గురు కలిసి చిన్న తరహా యూనిట్లను ఏర్పాటు చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణ కోసం తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ టాస్క్, వీహబ్‌తో అవసరమైన అనుసంధానాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. టామ్‌కామ్ ద్వారా విదేశాల్లో కూడా ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ముఖ్యంగా జర్మనీ, జపాన్ దేశాల్లో నర్సులకు అధిక డిమాండ్ ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూబీఐ డీజీఎం నటరాజ్, ఎల్డీఎం ప్రవీణ్ కుమార్, ఏపీ డీ రవీందర్, డీపీఎం రమణ, ఆర్‌శెట్టి డైరెక్టర్ వెంకటేష్, సంబంధిత శాఖల అధికారులు, శిక్షణ పొందిన అభ్యర్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి అంజయ్యకు సన్మానం

మెట్‌పల్లి డివిజన్,ప్రభాతవార్త:



కాంగ్రేస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకమైన మెటుపల్లి మాజీ ఎంపీపీ తోగిటి అంజయ్య ను మెటుపల్లి వెండి బంగారు వర్తక సంఘం,సిల్వర్ మర్చంట్ అసోసియేషన్ ల ఆధ్వర్యంలో పట్టణంలోని జువ్వాడి భవన్ లో బుధవారం రాత్రి ఆత్మీయ సన్మానం కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా డిసిసి ప్రధాన కార్యదర్శి తోగిటి అంజయ్య మాట్లాడుతూ.. తోటి స్వర్ణకార కులస్తుడిగా నన్ను గుర్తించి ఆత్మీయ సన్మానం చేసిన సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలియచేసారు.ఈకార్యక్రమంలో సిల్వర్ మర్చంట్ అసోసియేషన్,మెటుపల్లి వెండి బంగారు వర్తక సంఘం అధ్యక్షులు తోగిటి రమేష్,బిజ్జారపు నవీన్, ప్రధానకార్యదర్శి లు కోటగిరి తిరుమల్, తిప్పర్తి వెంకటేశ్వర్లు,ఉపాధ్యక్షులు బిజ్జారపు రఘు,గాలిపెళ్ళి నాగరాజు,కోశాధికారి ఇల్లేందుల ఉదయ్,స్వర్ణకార సంఘం మాజీ అధ్యక్షులు నాంపల్లి సింహాద్రి,మెటుపల్లి వెండి బంగారు వర్తక సంఘం మాజీ అధ్యక్షులు నాంపల్లి మారుతి,నాయకులు తోగిటి భూపాల్,తునికి ఆనంద్,తుమ్మనపల్లి మారుతి,నాంపల్లి పవన్, ఇల్లేందుల నరేష్,చిలుముల విజయ్,పోతులూరి చారి, తదితరులు పాల్గొన్నారు.

టామ్‌కామ్ ఆధ్వర్యంలో విదేశీ ఉద్యోగాల భర్తీ

జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం రాజశేఖర్

జూలై 21న హైదరాబాద్ లో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు



పెద్దపల్లి, ప్రభాతవార్త: టామ్‌కామ్ ఆధ్వర్యంలో విదేశీ ఉద్యోగాల భర్తీ చేపడుతున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం రాజశేఖర్ తెలిపారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లోని దుబాయ్‌లో గల ఒక ప్రముఖ కంపెనీలో ఖాళీగా ఉన్న విదేశీ ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ అయిన తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ నియామకాలు జరుగుతాయని, ప్రస్తుతం క్లీనర్స్, టైల్ మేసన్, ఆల్ రౌండర్ మేసన్, బ్లాక్ ప్లాస్టర్ మేసన్, స్టీల్ ఫిక్సర్, షట్టరింగ్ కార్పెంటర్, ప్లంబర్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్, పెయింటింగ్ కార్పెంటర్, మిగ్ వెల్డర్, జనరల్ హెల్పర్ విభాగాల్లో మొత్తం 500 మంది అభ్యర్థుల అవసరం ఉందని తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారికి నైపుణ్య గ్రేడ్ ప్రకారం ఓవర్ టైంతో పాటు వేతనం అందించబడుతుందని, వసతి, రవాణా, భోజన సౌకర్యం యజమాని ద్వారా కల్పించబడుతుందని, రోజుకు 9 గంటల పని, అదనంగా ఓవర్ టైం ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత ట్రేడ్లలో అనుభవం కలిగి ఉండాలని సూచించారు. ఈ నియామక ప్రక్రియ వాక్ ఇన్ ఇంటర్వ్యూ ద్వారా జరుగుతుందని, ఇంటర్వ్యూలు జూలై 21న హైదరాబాద్‌లోని మసాబ్ ట్యాంక్ సమీపంలో ఉన్న టామ్‌కామ్ కార్యాలయంలో నిర్వహించబడుతాయని, ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, పాస్‌పోర్ట్, విద్యార్హత, అనుభవ ధృవీకరణ పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 8328602231, 9440050951, 9440051452 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి కల్పనాధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కార్మికులపై పెనాల్టీ రద్దు చేయాలి

ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ డిమాండ్

గోదావరిఖని, ప్రభాత వార్త:



సింగరేణిలో వేలాది మంది కాంట్రాక్టు కార్మికులు కనీస హక్కులకు నోచుకోకుండా విధులు నిర్వర్తిస్తుండగా, అనారోగ్యంతో విధులకు హాజరుకాని వారిపై రోజుకు రూ.300 చొప్పున పెనాల్టీ విధించడం అమానుషమని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ విమర్శించారు. ఈ విధానాన్ని వెంటనే రద్దు చేసి, కాంట్రాక్టు కార్మికులకు చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ సింగరేణి సీఎండీకి లేఖ పంపారు.లేఖలో ఆయన మాట్లాడుతూ.. సింగరేణిలో వివిధ విభాగాల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులు ఏళ్ల తరబడి తక్కువ వేతనాలతో సేవలందిస్తున్నప్పటికీ, వారికి కనీస వేతనాలు, చెల్లింపు సెలవులు, కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయాలు వంటి ప్రాథమిక హక్కులు కూడా అందడం లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేస్తున్నప్పటికీ సంక్షేమ పరంగా తీవ్ర వివక్ష కొనసాగుతోందని ఆరోపించారు.



గంగనాల ఆయకట్టుకు నీటి విడుదల

ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త :



ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గ్రామ శివారులో గోదావరి నది తీరాన ఉన్న గంగనాల ఆయకట్టు కాలువకు గురువారం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నీటిని విడుదల చేశారు. ముందుగా గోదావరి తల్లికి తెప్ప సమర్పించి మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజాప్రతినిధులు, అభివృద్ధి కమిటీ సభ్యులు గేట్ ద్వారా కాలువలోకి నీటిని విడుదల చేశారు.గంగనాల ఆయకట్టు కింద ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి, యామాపూర్, ఫకీర్ కొండాపూర్, మల్లాపూర్ మండలంలోని నడికుడ, మొగిలిపేట, ఓబులాపూర్, సంగెం, శ్రీరాంపూర్, దాంరాజ్‌పల్లి గ్రామాలకు సాగునీరు అందుతోంది. ఈ ఆయకట్టు కింద సుమారు 5 వేల ఎకరాలకు సాగునీరు అందుతున్నట్లు తెలిపారు. వానాకాలం, వేసవికాలంలో రైతులు ఈ ఆయకట్టు కింద వివిధ పంటలను సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుతం నీటి విడుదలతో రైతులు వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తరి రామానుజం, సహకార సంఘం చైర్మన్ అంకతి రాజన్న, అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎడిపెల్లి మురళి, ఉపసర్పంచ్ బర్మ మల్లయ్య, అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు మెగిలి దేవదాస్, కోశాధికారి అన్నరపు రాజారెడ్డి, రైటర్ పెంట మహేష్, అభివృద్ధి కమిటీ సభ్యులు అంకతి రాజలింగం, కుమ్మరిపెల్లి మల్లేశం, పల్లి పెద్దలు, జిల్లా ఆనందం, అల్లెపు మహేష్, మాలేపు లక్ష్మ ణ్, సిలివేరి మహేష్, అక్కపెల్లి గంగాధర్, కనపర్తి నరేష్, పట్నం నర్సయ్య, గుడ్ల శ్రావణ్, మగ్గిడి గంగాధర్, లష్కర్ తోకల గణేష్, తోకల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి మనోజ్ సేవలు అభినందనీయం

సర్పంచ్ కల్లెడ గంగాధర్

ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త :



మండలంలోని ఎర్దండి గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా ఆరు సంవత్సరాల ఎనిమిది నెలల పాటు సేవలందించి ఇటీవల బదిలీపై వెళ్లిన మనోజ్ సేవలు అభినందనీయమని సర్పంచ్ కల్లెడ గంగాధర్ అన్నారు. మనోజ్‌ను సర్పంచ్, గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గంగాధర్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శిగా మనోజ్ గ్రామానికి అందించిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయన పనిచేసిన కాలంలో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి మండలంలో మంచి పేరు తీసుకువచ్చారని కొనియాడారు. ఉద్యోగులు ఎక్కడ పనిచేసినా తమ సేవలతో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తెడ్డు రాజారెడ్డి, వార్డు సభ్యులు కల్లెడ నవీన్, గుర్రాల జ్యోతి, కోరిపల్లి లక్ష్మి, దేశెట్టి రాజేందర్, సాన గంగారెడ్డి, కన్నడ సరస్వతి, బాసెట్టి బుచ్చవ్వ, గుజ్జరి సుభాష్, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నిరోషా, హెల్త్ ఆఫీసర్ రూపేష్, జిపిఒ శేఖర్, కాంగ్రెస్ నాయకురాలు లక్కిడి నరసవ్వ, కరోబార్ రతన్, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, వీవోఏలు పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ రాజీనామా చేయాలి

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :

సిరిసిల్ల మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్ రాజీనామా చేయాలని బిజెపి పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రాజీనామా చేయాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట బిజెపి పట్టణాధ్యక్షుడు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు మాట్లాడుతూ మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు . స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ మున్సిపాలిటీలో జరుగుతున్న పరిణామాలపై స్పందించాలన్నారు . పట్టణంలో కొత్తగా నిర్మాణాలు చేపట్టేవారిని, వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని అధికారుల ద్వారా ఒత్తిళ్లు తెచ్చి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. చిన్న వ్యాపారులు, పండ్ల దుకాణాల నిర్వాహకులు, షాపింగ్ మాల్స్ యజమానులను సైతం ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రజా



సమస్యలపై ఎమ్మెల్యే సమీక్షలు నిర్వహించడం లేదని విమర్శించారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై జిల్లా కలెక్టర్ వెంటనే విచారణకు ఆదేశించాలన్నారు . ప్రజలను బెదిరించే రాజకీయాలను మానుకోవాలన్నారు . అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోతే భారతీయ జనతా పార్టీ ప్రజల తరఫున ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు . ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ఆడెపు రవీందర్, మ్యాన రామ్ ప్రసాద్, శ్రీనివాస్, శ్రీహరి, మోర రవి, సూరం వినయ్, రాజు, వంగ అనిల్ కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫసల్ భీమా అమలు చేయాలని భాజపా నాయకుల పాదయాత్ర

ఇల్లంతకుంట, ప్రభాతవార్త

రైతన్నలకు ఫసల్ భీమా యోజన అమలు చేయాలనీ డిమాండ్ చేస్తూ తహసీల్దార్ సురేష్ కు బిజెపి నాయకులు గురువారం వినతిపత్రం అందించారు.మండల శాఖ ఆధ్వర్యంలో మండలములోని రేపాక గ్రామ నరసింహస్వామి దేవాలయం నుండి ఇల్లంతకుంట మండల తాసిల్దారు కార్యాలయం వరకు పాదయాత్ర చేసి విన్నవించుకున్నారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రైతుల ప్రయోజనాల కోసం ఏర్పాటుచేసిన ఫసల్ బీమా యోజనను గత బి ఆర్ ఎస్, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ రెండు ప్రభుత్వాలు కూడా అమలు చేయడంలో విఫలమయ్యాయి అని అన్నారు.ఫసల్ బీమా పథకం అమలు చేయకపోవడం వల్ల లక్షలాది మంది రైతులు ఇబ్బంది పడుతున్నారని,అదేవిధంగా అనేకమంది రైతులు ఆత్మహత్యలకు గురవుతున్నారు అని అన్నారు.అతివృష్టి,అనావృష్టి,అగ్ని



ప్రమాదాలు,గాలి వానలు,రాళ్ల వానల వల్ల నష్టపోతున్న రైతు లను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఆనాడే ఫసల్ బీమా యోజనను అమలు చేసింది.కానీ తెలంగాణలో ఉన్న ప్రభుత్వాలు రైతులను పట్టించుకోకుండా రైతులను గాలికి వదిలేయడం వల్ల రైతులకు నష్టం జరిగింది.కాబట్టి తక్షణమే ఫసల్ బీమా యోజనను అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.అంతేకాకుండా 15 వేల రైతు భరోసాను అమలు చేయాలని,కౌలు రైతులకు 12 వేల రూపాయల హామీని వెంటనే అమలు చేయాలని భాజపా మండల అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్ గారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ కోసం భవనాల పరిశీల

అధికారులతో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త

: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ కోసం జిల్లాలోని పలు భవనాలను అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం పరిశీలించారు. ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులకు ఉదయం వేళలో సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ కింద అల్పాహారం, పాలు అందించే కార్యక్రమంలో భాగంగా ఆహార పదార్థాలు సిద్ధం చేసేందుకు సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోని పలు భవనాలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, హరే కృష్ణ మూవ్మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ (హెచ్ కే ఎం సీ ఎఫ్) బాధ్యులు



గురువారం పరిశీలించారు.ఈ పరిశీలనలో సిరిసిల్ల, వేములవాడ తహసీల్దార్లు మహేష్, జయంత్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

అసలు సిరిసిల్లకు ఏమైంది?

మళ్లీ ఫుడ్ పాయిజన్ కలకలంనిత్యం ఆసుపత్రి పాలవుతున్న జనాలు.. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ఫుడ్ ఇన్స్పెక్టర్!బకాసుర రెస్టారెంట్‌లో బిర్యానీ తిని నలుగురు యువకులకు అస్వస్థత..

సిరిసిల్ల బ్యూరో, ప్రభాతవార్త

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మరోసారి ఫుడ్ పాయిజన్ ఘటన తీవ్ర కలకలం రేపింది. పట్టణంలోని బకాసుర రెస్టారెంట్‌లో మండి బిర్యానీ తిన్న నలుగురు యువకులు తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలయ్యారు. బిర్యానీ ఆరగించిన కొద్దిసేపటికే వీరంతా ఒకరి వెనుక ఒకరు వాంతులు, విరేచనాలతో కుప్పకూలారు. గమనించిన స్థానికులు వెంటనే వారిని వైద్యం నిమిత్తం తరలించగా, బాధితుల్లో ఒకరి పరిస్థితి తీవ్రంగా ఉండటంతో హుటాహుటిన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన ముగ్గురు యువకులకు సమీపంలోని ఆర్ఎంపీ వైద్యుడి వద్ద ప్రాథమిక చికిత్స అందించారు. కలుషిత ఆహారం తీసుకోవడం వల్లే వీరికి ఫుడ్ పాయిజన్ అయినట్లు వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించగా, ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడి పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ వరుస ఘటనలు చూస్తుంటే అసలు సిరిసిల్లకు ఏమైంది? జనాలు రెగ్యులర్ గా ఫుడ్ తిని ఎందుకు అస్వస్థతకు గురవుతున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇటీవల కాలంలో సిరిసిల్ల జిల్లాలో వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు వెలుగుచూస్తుండటంపై ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. మొన్న పానీపూరి స్వీట్ హౌస్, నేడు బకాసుర రెస్టారెంట్.. ఇలా జిల్లాలో చిరుతిండ్లు తినాలన్నా, హోటల్‌కు వెళ్లాలన్నా ప్రజలు వణికిపోతున్నారు. జిల్లాలో హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, వీధి వ్యాపార బండ్ల నిర్వహణ పూర్తిగా నియంత్రణ కోల్పోయినట్లు కనిపిస్తోంది. ఎక్కడ చూసినా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న రెస్టారెంట్లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రోడ్లపై బండ్లు పెట్టుకొని కుచ్చులు, బజ్జీలు వేస్తూ నాణ్యతలేని నూనెలు, కుళ్ళిన పదార్థాలు వాడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇంత జరుగుతున్నా స్థానిక ఫుడ్ ఇన్స్పెక్టర్ వ్యవహారశైలిపై ప్రజల నుండి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన ఫుడ్ ఇన్స్పెక్టర్ ఆఫీసుకే పరిమితమై, నామమాత్రపు తనిఖీలతో కాలక్షేపం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు వ్యాపార లాభాపేక్షతో నిల్వ ఉంచిన, నాణ్యత లేని ఆహారాన్ని విక్రయిస్తున్నా.. వాటిని పర్యవేక్షించాల్సిన ఫుడ్ ఇన్స్పెక్టర్ ఎందుకు మౌనంగా ఉంటున్నారని, చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక ఉన్న మతలబు ఏంటని స్థానికులు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ఫుడ్ ఇన్స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, అలాగే క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు చేపట్టి కలుషితాహారం విక్రయించే నిర్వాహకులపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



బిఆర్ఎస్ 10 సంవత్సర పాలనలో రైతులకు అన్యాయమే జరిగింది

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త

: రైతుల పేరుతో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు రాజకీయం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సూర దేవరాజు అన్నారు. గురువారం పెద్దూర్ లో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మాట్లాడుతూ పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు రైతులను పట్టించుకోని వారు ఇప్పుడు రైతులపై ప్రేమ చూపించడం ప్రజలను మోసం చేస్తుందని అన్నారు .కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పక్షాన అనేక సంక్షేమ నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం, రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. బీఆర్ఎస్ నాయకులు రక్తదానం చేయడం మంచి విషయమే అయినప్పటికీ దాన్ని రాజకీయ ప్రచారానికి ఉపయోగించడం సమంజసం కాదన్నారు. పదేళ్ల పాలనలో రైతుల సమస్యలను పట్టించుకోలేదన్నారు . కాలేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై విచారణ కొనసాగుతోందని, విచారణ పూర్తయ్యే వరకు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తోందని, తప్పుడు ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ తిప్పికొడుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాయకులు ఆకునూరు బాలరాజు, తిరుపతి , ప్రశాంత్ , రాజు, బోప్ప దేవయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు

మధ్య మానేరు నీటి విడుదల కోసం రైతుల ధర్నా

ఇల్లంతకుంట, ప్రభాతవార్

మధ్య మానేరు ప్రాజెక్టు నుంచి సాగునీటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పొత్తూరు బ్రిడ్జి వద్ద రైతులు గురువారం ధర్నా నిర్వహించారు.సాగు నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.సాగునీరు అందక నార్లు ముదిరిపోయే అవకాశం ఉందన్నారు.అక్కడక్కడా దున్నిన పొలాలు కూడా నాట్లు వేయకముందే ఎండిపోయినట్లు రైతులు పేర్కొన్నారు.తాగు నీటికి కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోయారు.ప్రభుత్వం వెంటనే స్పందించి మధ్య మానేరు నుంచి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ధర్నాకు మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ వేణు మద్దతు ప్రకటించి పాల్గొన్నారు.రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు.అధికారులు పరిస్థితిని పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని,లేకుంటే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు.ధర్నా ప్రశాంతంగా కొనసాగగా పలువురు రైతులు,ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రెస్టారెంట్‌లో బిర్యానీ తిని నలుగురు యువకులకు అస్వస్థత

ఆసుపత్రి పాలైన బాధితులు.. తనిఖీలు కరువయ్యాయంటున్న స్థానికులు

సిరిసిల్ల అర్బన్, ప్రభాత వార్త:

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మరోసారి ఫుడ్ పాయిజన్ ఘటన కలకలం రేపింది. పట్టణంలోని ఖిబకాసురఖి రెస్టారెంట్‌లో మండి బిర్యానీ తిన్న నలుగురు యువకులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బిర్యానీ ఆరగించిన కొద్దిసేపటికే వీరంతా వాంతులు, విరేచనాలతో కుప్పకూలారు. గమనించిన స్థానికులు వెంటనే వారిని వైద్యం నిమిత్తం తరలించారు. బాధితుల్లో ఒకరి పరిస్థితి తీవ్రంగా ఉండటంతో హుటాహుటిన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఇటీవల కాలంలో సిరిసిల్ల జిల్లాలో వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు వెలుగుచూస్తుండటంపై ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వ్యాపారులు లాభాపేక్షతో నిల్వ ఉంచిన, నాణ్యత లేని ఆహారాన్ని విక్రయిస్తున్నా.. హోటళ్లు, రెస్టారెంట్లను పర్యవేక్షించాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు నామమాత్రంగానే వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టి కలుషితాహారం విక్రయించే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

రైతు విజ్ఞాన కేంద్రానికి త్వరలోనే భూమి కేటాయింపు

ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:



జగిత్యాల నియోజకవర్గానికి నూతనంగా తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం మంజూరైన నేపథ్యంలో,పోలాస వ్యవసాయ పరిశోధన సంస్థ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ వెంకట్ రెడ్డి,టి ఆర్‌వికే కోఆర్డినేటర్ విజయభాస్కర్ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటు కానున్న రైతు విజ్ఞాన కేంద్రంలో సీడ్ ప్రొడక్షన్ పనుల నిర్వహణకు గానూ తగిన భూమిని కేటాయించవలసిందిగా వారు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.అధికారుల అభ్యర్థనపై ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సానుకూలంగా స్పందించారు. జగిత్యాల నియోజకవర్గ పరిధిలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి, రైతుల సంక్షేమానికి ఈ కేంద్రం ఎంతగానో దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మేరకు త్వరలోనే అనువైన స్థలాన్ని గుర్తించి, కేటాయించేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులతో ఎమ్మెల్యే ఫోన్ ద్వారా మాట్లాడారు.వ్యవసాయ అభివృద్ధికి అవసరమైన భూమిని త్వరితగతిన కేటాయించాలని,ఇందుకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఎమ్మెల్యే త్వరితగతిన స్పందించి భూమి కేటాయింపునకు హామీ ఇవ్వడం పట్ల వ్యవసాయ అధికారులు సంతోషం వ్యక్తం చేశారు.

భూభారతి రీసర్వేపై రైతులకు అవగాహన

కొడిమ్యాల, ప్రభాతవార్త:



ప్రభుత్వం చేపట్టిన భూభారతి భూ సర్వే, రీసర్వే కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం తిప్పాయపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నరేష్ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, జియో కోఆర్డినేట్స్ ఆధారంగా భూముల హద్దులను ఖచ్చితంగా గుర్తించి రీసర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తయితే గ్రామంలో భూ హద్దుల వివాదాలు, యాజమాన్యానికి సంబంధించిన సమస్యలు గణనీయంగా తగ్గి, ప్రతి రైతుకు స్పష్టమైన భూ రికార్డులు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ప్రతి భూ యజమానికి ప్రత్యేకంగా ఎల్పిఎమ్ మ్యాపులను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. రీసర్వే కార్యక్రమం విజయవంతం కావాలంటే రైతులు, గ్రామస్తులు పూర్తి సహకారం అందించాలని కోరారు. అలాగే సర్వే సమయంలో అవసరమైన భూ పత్రాలు, సంబంధిత వివరాలను అధికారులకు అందజేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సదస్సులో పాల్గొన్న రైతులు అడిగిన పలు సందేహాలకు అధికారులు సమగ్రంగా సమాధానాలు ఇస్తూ, భూభారతి రీసర్వే వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజేశం, మండల సర్వేయర్ తిరుపతి, ఆర్ఐ తిరుపతి, గ్రామ పాలనా అధికారి అలిమ, గ్రామపంచాయతీ కార్యదర్శి, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం అవసరం

-జిల్లా ప్రజలకు నాలుగు దశాబ్దాలుగా సేవలందిస్తున్న రోటరీ క్లబ్

- ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

జగిత్యాల టౌన్,ప్రభాత వార్త:



పట్టణ అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం ఎంతో అవసరమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల రోటరీ క్లబ్, ఆపి ప్రివెంటివ్ హెల్త్ క్లినిక్, రెడ్ క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణంలోని గొల్లపల్లి రోడ్డులో ఉన్న సత్య హరిశ్చంద్ర శ్మశాన వాటికకు మూడు డెడ్ బాడీ ఫ్రీజర్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రోటరీ క్లబ్ గత నాలుగు దశాబ్దాలుగా జిల్లా ప్రజలకు నిరంతర సేవలు అందిస్తూ సామాజిక సేవలో ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రజలకు అవసరమైన సేవలను అందించడంలో ఇలాంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. శ్మశాన వాటికలో డెడ్ బాడీ ఫ్రీజర్ల ఏర్పాటు ద్వారా ప్రజలకు ఎంతో ఉపయోగం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్ లక్ష్మీ రాజు, రోటరీ క్లబ్ సభ్యులు మంచాల కృష్ణ, సిరిసిల్ల శ్రీనివాస్, ఏపీఎల్ఎన్ చారి, టీపీ సూర్యం, కొత్త ప్రతాప్, త్రివేణి సాగర్, ఎన్నాకుల అశోక్, ఆంటోనీ ముత్తు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు రాజ్‌కుమార్, బోడ్ల జగదీశ్, నాయకులు రామకృష్ణ రెడ్డి, ఆపి కార్యనిర్వాహక సభ్యురాలు రాధికా సంజయ్ కుమార్ పాల్గొన్నారు.

మహిళలతోనే కుటుంబాల అభివృద్ధి

వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం మహిళలు ముందుండాలి

ప్రజాధర్బార్ పుస్తకావిష్కరణలో

రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య పిలుపు

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



రాష్ట్ర, దేశ అభివృద్ధి మహిళల చేతుల్లోనే ఉందని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య అన్నారు. హైదరాబాద్ విద్యానగర్ లోని కృష్ణయ్య కార్యాలయంలో జగిత్యాల కు చెందిన సామాజిక సేవకురాలు,రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ దాసరి రజిని తదితరులు కలిసి గురువారం కృష్ణయ్య రచించిన "ప్రజాధర్బార్" పుస్తకావిష్కరణలో పాల్గొని ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ "మహిళలు ఈ సమాజానికి దిక్సూచిలా ఉండాలన్నారు. మహిళలు ముందుండి సమాజాన్ని చైతన్యపరుస్తూ, నిరంతరం పోరాటం చేస్తేనే రాష్ట్రం, దేశం అత్యంత వేగవంతంగా అభివృద్ధి పథంలో నడుస్తుందని ఆయన పిలుపునిచ్చారు.వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం మహిళలు ముందుండి పోరాడాలని కృష్ణయ్య అభిప్రాయపడ్డారు."మహిళా శక్తి లేనిదే సమాజ ప్రగతి సాధ్యం కాదనీ, బీసీ సంక్షేమం, సామాజిక న్యాయం కోసం మహిళలు నాయకత్వం వహిస్తే దేశం వేగంగా ముందుకు వెళ్తుందని కృష్ణయ్య ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రచయిత, దర్శకుడు అశోక్ కుమార్, సంఘ సేవకురాలు వెంకట్ శోభ,గాయకులు వినయ్,నటుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధి లో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం అవసరం

4 దశాబ్దాలుగా జిల్లా ప్రజలకు నిరంతరం సేవలు

అందిస్తున్న రోటరీ క్లబ్ జగిత్యాల

ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:జగిత్యాల రోటరీ క్లబ్ ఆపి ప్రివెంటివ్ హెల్త్ క్లినిక్ రెడ్ క్రాస్ వారి ఆధ్వర్యం లో జగిత్యాల పట్టణ గొల్లపల్లి రోడ్డులోని సత్య హరిశ్చంద్ర శ్మశాన వాటికలో 3 డెడ్ బాడీ ఫ్రీజర్ లను ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ స్థానిక కౌన్సిలర్ లక్ష్మీ రాజు,రోటరీ క్లబ్ సభ్యులు మంచాల కృష్ణ ,సిరిసిల్ల శ్రీనివాస్, ఏ వి ఎల్ ఎన్ చారి, టివి సూర్యం,కొత్త ప్రతాప్, త్రివేణి సాగర్, ఎన్నాకుల అశోక్, ఆంటోనీ ముత్తు తోపాటు కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, రాజ్ కుమార్, బోడ్ల జగదీష్, నాయకులు రామకృష్ణ రెడ్డి, ఆపి కార్యనిర్వాహక సభ్యురాలు శ్రీమతి రాధికా సంజయ్ కుమార్‌తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాల వార్త



శ్రీ చైతన్య టెక్నో కర్ష్యులం లైఫ్ స్కిల్స్ కార్యక్రమం నిర్వహణ

జగిత్యాల అర్బన్ ప్రభాతవార్త



జగిత్యాల పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో కర్ష్యులం పాఠశాల బ్రాంచ్ 2 లో లైఫ్ స్కిల్స్ ప్రోగ్రాం నిర్వహణలో భాగంగా విద్యార్థులకు పాఠశాలలో పాఠ్యాంశాల గురించే కాకుండా సమాజంలో వారు ఏ విధంగా జీవించాలో అందుకు కావలసిన నైపుణ్యత కూడా నేర్పిస్తామని భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నంత స్థానంలో ఉండే విధంగా కృషి చేస్తామని ఐస్ బ్రేకింగ్, మెమోరీ టెక్నిక్స్, హైజాన్ మరియు క్లీన్లినెస్, రెస్పెక్ట్ టీచర్స్ అండ్ పేరెంట్స్ ఎమోషన్స్, మొదలగు భాగాలుగా విభజించి విద్యార్థులకు ఆవాగాహన కల్పిస్తూ అన్ని రకాలుగా వారికి దశలవారీగా నేర్పించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ సారిక అన్నారు .. ఈ కార్యక్రమంలో ఎ. జి. ఎం..రాజు, పాఠశాల ప్రిన్సిపాల్ సారిక, లైఫ్ స్కిల్స్ ట్రైనర్ జీవన్ సందీప్ అకాడమిక్ కోఆర్డినేటర్ మమత, నాగరాజు, ఐపీఎల్ ఇన్చార్జి కిరణ్, ప్రైమరీ ఇంచార్జ్ రేవతి తదితరులు పాల్గొన్నారు.

జన జాగరణ యాత్ర గోడ పత్రిక ఆవిష్కరణ

జూలై 25, 26 తేదీల్లో జగిత్యాలకు టీఎస్ సీపీఎస్

ఈయూ బస్సు యాత్ర

జగిత్యాల టౌన్, ప్రభాత వార్త:



టీఎస్ సీపీఎస్ఈయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జన జాగరణ బస్సు యాత్రకు మద్దతుగా జగిత్యాల జిల్లా కేంద్రంలోని సమీకృత సముదాయ భవనంలో గురువారం గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టి ఎన్ జి ఓ టిజిఓ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీఎస్ సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షుడు గంగాధరి మహేష్ మాట్లాడుతూ, నూతన పెన్షన్ విధానాన్ని (సీపీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ నాయకత్వంలో 33 జిల్లాల గుండా జన జాగరణ బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జూలై 25, 26 తేదీల్లో జగిత్యాల జిల్లాలో జరిగే యాత్రలో జిల్లాలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా టి ఎన్ జి ఓ అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, టిజిఓ అధ్యక్షుడు కందుకూరి రవిబాబు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు అరుణ మాట్లాడుతూ, సీపీఎస్ రద్దు కోసం ప్రతి ఉద్యోగి జన జాగరణ యాత్రకు సంపూర్ణ మద్దతు తెలియజేయాలని, అలాగే ఆగస్టు 23న హైదరాబాద్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్వ సతీశ్, సందుపట్ల రమేశ్, అల్లే రాజేందర్ పాల్గొన్నారు.

నిరుపేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ తో భరోసా

సైదాపూర్, ప్రభాత వార్త:

నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో భరోసా ఇస్తుందని వ్యవసాయ



మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్ అన్నారు. రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని వెన్నంపల్లి గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు చెక్కులను అందజేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చాడ కొండల్ రెడ్డి, సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్, మాజీ సింగల్ చైర్మన్ సారబుడ్ల రాజిరెడ్డి, మాజీ ఎంపిటిసి పరకాల రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మిట్టపల్లి కిష్టయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మారుపాక తిరుపతి, గుజ్జులపల్లె గ్రామ శాఖ అధ్యక్షులు కరుణాకర్, కొడగాని కిషన్ రావు, దాసరి సందీప్ లు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందకుండా శాస్త్రీయ పద్ధతులను అవలంభించాలి ఎంపవో వైదేహి

సైదాపూర్, ప్రభాత వార్త:

ఈ ఏడాది వర్షాపాతం సాధారణం కంటే తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో రైతులు ఆందోళన చెందకుండా శాస్త్రీయ పద్ధతులను అవలంభించాలని మండల వ్యవసాయ అధికారి వైదేహి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని ఆకునూర్ గ్రామ రైతు వేదికలో ఎల్ నినో ప్రభావం అత్యవసర పంట ప్రణాళికపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుత ఖరీఫ్ (వానాకాలం) సీజన్‌లో ఎల్ నినో ప్రభావం వల్ల నెలకొన్న వర్షభావ పరిస్థితులను అధిగమించేందుకు రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఆకునూర్ గ్రామ రైతు వేదికలో రైతు అవగాహన సదస్సు నిర్వహించబడింది. జూలై ఆఖరు వరకు వర్షాలు ఆలస్యమైతే వరికి బదులుగా తక్కువ నీటితో ఎక్కువ దిగుబడినిచ్చే కంది, పెసర, మినుము, అలసందలు, ఆముదం వంటి ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు. వయస్సు పైబడిన వరి నార్లను నాటేటప్పుడు కుదురుకు 6 నుండి 8 నార్లు దగ్గరగా నాటాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో సంబంధిత ఏఈవోల ద్వారా ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... వర్షాలు లేని పొడి వాతావరణ పరిస్థితుల్లో తెగుళ్లు, కత్తెర పురుగు వంటి కీటకాలు ఆశించే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. తక్కువ నీటి లభ్యత ఉన్నప్పుడు రిడ్జ్ అండ్ ఫ్రో (బోదెచాలు) పద్ధతి ద్వారా నేలలో తేమను కాపాడుకోవాలని, తీవ్రమైన పొడి వాతావరణం ఉన్నప్పుడు పంటలపై 2 శాతం, యూరియా లేదా 1 శాతం, పొటాషియం నైట్రేట్ పిచికారి చేయాలని శాస్త్రీయ సూచనలు చేశారు.

ఇఫ్కో ఎండీవో ఐలయ్య మాట్లాడుతూ.... ప్రస్తుత పరిస్థితుల్లో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, ద్రవ రూపంలో ఉండే నానో యూరియా, నానో డీఏపీలను పిచికారీ చేయడం ద్వారా తక్కువ తేమలో కూడా పంటలకు పోషకాలు అందుతాయని, దీని వల్ల పెట్టుబడి, ఖర్చు తగ్గి దిగుబడి పెరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసిన వ్యవసాయ విస్తరణ అధికారి వంశీ మాట్లాడుతూ... ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అందిస్తున్న సేవలను, సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సదస్సులో ఆకునూర్ పరిసర గ్రామాల పరిధిలోని రైతులు పాల్గొని తమ సందేహాలను శాస్త్రవేత్తల ద్వారా నివృత్తి చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వైదేహి తో పాటు కేవీకే సైంటిస్ట్ శ్రీనివాస్ రెడ్డి, ఏఈవో వంశీ, ఇఫ్కో ఎండీవో ఐలయ్య, రైతులు పాల్గొన్నారు.



చెస్ పోటీల ఏర్పాట్లు పూర్తి - కంకటి అనూప్ కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, ప్రభాతవార్త:

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జులై 18, 19 తేదీల్లో స్థానిక వీ కన్వెన్షన్ లో 4వ ఆల్ ఇండియా ఓపెన్, జూనియర్ చెస్ చాంపియన్‌షిప్ -2026 పోటీలను నిర్వహిస్తున్నట్లు పోటీల నిర్వాహకుడు, జీనీయస్ చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్ తెలిపారు. గురువారం కరీంనగర్‌లో పోటీలకు సంబంధించిన వివరాలను



వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్ ఇండియా స్థాయి పోటీలను జిల్లా కేంద్రంలో 4వ సారి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల పాటు జరుగనున్న ఈ పోటీలను అట్టహాసంగా నిర్వహించడానికి ఏర్పాట్లు కూడా చేసినట్లు తెలిపారు. పోటీల్లో భాగంగా 8 రౌండ్ల పాటు మ్యాచ్‌లు జరుగుతాయని, విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు రూ. లక్ష 25 వేల నగదు పురస్కారాలను, ట్రోఫీలు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. పోటిలకు తెలంగాణ లోని పలు జిల్లాలో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పలువురు క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు రెండు రోజుల పాటు ఉచిత బోజన సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. పోటీలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జీనీయస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకుడు కంకటి కనకయ్య, టోర్నమెంట్ నిర్వాహకులు సృజన్, రవిచంద్ర అకెనపల్లి నాగరాజు, భరోసా స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షుడు తాటిపల్లి సతీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ జడ్పీటీసీ శేఖర్ గౌడ్ జన్మదిన వేడుకలు

మానకొండూర్, ప్రభాతవార్త:

మానకొండూర్ మాజీ జడ్పీటీసీ,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్ గౌడ్ జన్మదిన వేడుకలు గురువారం మండల పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. మండల కేంద్రంలోని పల్లెమీద చౌరస్తాలో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలలో పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కేకును కట్ చేసి, టపాసులు పేల్చి,



మిఠాయిలు పండ్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆయురారోగ్యాలతో ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మారెన్నో జరుపుకోవాలని, భవిష్యత్తులో ఉన్నతమైన పదవులను చేపట్టి ప్రజలకు సేవలు అందించాలని మండల పార్టీ నేతలు ఆకాంక్షి ంచారు. వేడుకలలో సర్పంచులు పడాల సత్యనారాయణ గౌడ్, పార్నంది కిషన్, వెన్న అనిల్ కుమార్, గ్రామ శాఖ అధ్యక్షులు పిట్టల మధు, నాయకులు శాతరాజు యాదగిరి, శ్యాంసన్, బోడ రాజశేఖర్, జనగామ శంకర్, రమేష్, గడ్డి గణేష్, నామాల శ్రీనివాస్, రొడ్డ అంజయ్య, కొండ్ర ఎలేంద్ర, బొంగోని రేణుక, మునిగళ్ళ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే మానకొండూరు మండలంలోని పల్లె మీద బస్టాండ్ వద్ద మండల గౌడ సంఘం నేతల ఆధ్వర్యంలో మాజీ జెడ్పిటిసి శేఖర్ గౌడ్ జన్మదిన వేడుకలను గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్గొండ తిరుపతి గౌడ్ , నియోజకవర్గ ఇన్చార్జి గోపగాని నవీన్ గౌడ్, బండి అజయ్ అభిరామ్ తిరుపతి గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

కరీంనగర్ వార్త



అరుదైన వ్యాధిని జయించిన 15 ఏళ్ల బాలిక...

.ప్రాణాలు నిలబెట్టిన యశోద వైద్యులు....

డాక్టర్ అశోక్ కుమార్

కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:

హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ వైద్యులు 15 ఏళ్ల బాలిక ప్రాణాలను కాపాడి అరుదైన ఘనత సాధించారు. థ్రోంబోటిక్ థ్రోంబోసైటోపెనిక్ పర్పురా అనే అత్యంత ప్రమాదకరమైన రక్త సంబంధిత వ్యాధితో బాధపడుతున్న సదరు బాలిక తీవ్రమైన జ్వరం, రక్తహీనత,



రక్తస్రావంతో ఆసుపత్రికి చేరుకోగా, వైద్యులు ఆమెను ప్రాణాపాయం నుండి రక్షి ంచారనీ యశోద హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ హెమటో ఆంకాలజీ, ఫిజీషియన్ డాక్టర్ కరణం అశోక్ కుమార్ తెలిపారు.గురువారం కరీంనగర్ యశోద హాస్పిటల్ లో ప్రెస్ మీట్ నిర్వహించి వివరాలు వెల్లడించారు...బాలికకు చికిత్స అందించిన మల్టీడిసిప్లినరీ వైద్య బృందం, వేగంగా ఖిథెరప్యూటిక్ ప్లాస్మా ఎక్స్ఛేంజ్‌ఖి ప్రక్రియను నిర్వహించడంతో ఆ బాలిక ఆరోగ్యాన్ని నిలకడగా మార్చమన్నారు..మెడికల్ ఐసియులో వెంటిలేటర్ సాయంతో చికిత్స అందించి, రెండు ప్లాస్మా ఎక్స్ఛేంజ్ సెషన్ల తర్వాత బాలిక పరిస్థితిలో గణనీయమైన మెరుగుదల కనిపించడంతో డిశ్చార్జ్ చేశారన్నారు. టీటీపీ అనేది ఒక మెడికల్ ఎమర్జెన్సీ అని, సకాలంలో ఖచ్చితమైన రోగ నిర్ధారణ, అధునాతన చికిత్స ద్వారానే పేషెంట్‌ను కాపాడగలిగామని తెలిపారు. యశోద హాస్పిటల్స్‌లోని అత్యాధునిక బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ విభాగం,నిపుణులైన వైద్య బృందం ఇటువంటి సంక్లిష్టమైన రక్త సంబంధిత సమస్యలకు 24 గంటల పాటు అత్యుత్తమ వైద్య సేవలను అందిస్తోందన్నారు.ప్రెస్ మీట్ లో యశోద హాస్పిటల్ వైద్యులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు....

కోరాలో విద్యార్థి మండలి ఎన్నికలు...

.ప్రతి ఓటు విలువైనది... ప్రతి స్వరం ముఖ్యమైనది...

కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:

కరీంనగర్ కోరా పాఠశాలలో విద్యార్థి మండలి ఎన్నికలు ప్రజాస్వామ్య స్ఫూర్తితో విజయవంతంగా నిర్వహించబడ్డాయనీ స్కూల్ యాజమాన్యం ఒక ప్రకటనలో గురువారం పేర్కొన్నారు...ఈ ఎన్నికల్లో చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రామ్ రెడ్డి,సింహాచలం హరికృష్ణ,సంతోష్ రెడ్డి లు పాల్గొని వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు.హెడ్ బాయ్/హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్/హెడ్ గర్ల్, స్వచ్ఛ భారత్ కెప్టెన్, డిసిప్లిన్ కెప్టెన్, స్పోర్ట్స్ కెప్టెన్, కల్చరల్ కెప్టెన్ పదవుల కోసం జరిగిన ఎన్నికల్లో విద్యార్థులు,ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని ఓటును నమోదు చేశారు.ఈ సందర్భంగా డైరెక్టర్లు హరికృష్ణ,సంతోష్ రెడ్డిలు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన పౌరసత్వం అలవడుతుందన్నారు. విద్యార్తుల్లో ఎన్నికలపై అవగాహన పెంపొందించే లక్ష ్యంతో ఎన్నికలను విజయవంతంగా నిర్వహించామని పేర్కొన్నారు.



కరీంనగర్ జిల్లా చేనేత సెల్ అధ్యక్షుడిగా సదానందం

హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:

కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా చేనేత సెల్ అధ్యక్షుడిగా హుజూరాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన బండారి సదానందం నియమితులయ్యారు. సిద్దిపేట పట్టణంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర



చేనేత సెల్ కాంగ్రెస్ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ ఈ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బండారి సదానందం మాట్లాడుతూ... తన నియామకానికి సహకరించిన రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, కరీంనగర్ జిల్లా ఇంచార్జీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మేడిపల్లి సత్యం, నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్ బాబులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ఈ నియామకంలో కీలక పాత్ర పోషించిన రాష్ట్ర చేనేత సెల్ కార్యదర్శి కూరపాటి రామచంద్రకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి నేరెళ్ల మహేందర్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాజీపేట శ్రీనివాస్, బిసి నాయకులు కన్నబోయిన మహేందర్, హుజురాబాద్ మెడికల్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ సంగం శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు సంగం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలే మేలు

-- రైతులను కోరిన ఏవో

హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:

వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలే మేలు అని హుజురాబాద్ మండల వ్యవసాయ అధికారి చంద భూమిరెడ్డి అన్నారు. గురువారం హుజురాబాద్ మండలం పోతిరెడ్డిపేట గ్రామంలో రైతులకు అవగాహన



సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులను దృష్టిలో ఉంచుకుని పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని అన్నారు. అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా పెసర, మినుము, కంది, నువ్వులు, కూరగాయలు వంటి ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా పెట్టుబడి తగ్గి మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని అన్నారు. గ్రామ సర్పంచ్ మంతెన సుమలత మాట్లాడుతూ... వర్షాభావ పరిస్థితుల్లో రైతులు నిరుత్సాహపడకుండా పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని అన్నారు. ఈ అవగాహన సదస్సులో ఏఈఓ పొద్దుటూరి సతీష్ రెడ్డి, కార్యదర్శి లావణ్య, కారోబార్ శ్రావణ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నిజాయితీకి నిదర్శనం

-- దొరికిన ట్యాబ్‌ను పోలీసులకు అప్పగించిన విద్యార్థి

జమ్మికుంట/హుజూరాబాద్, ప్రభాత వార్త:

హుజురాబాద్ మండలం చెల్పూర్ గ్రామానికి చెందిన నవమన్ పాషా



(తండ్రి: జాఫర్ పాషా), చెల్పూర్ ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. కాగా ఈ బాలుడికి పాఠశాల సమీపంలోని రోడ్డుపై ఒక సాంసంగ్ గెలాక్సీ ట్యాబ్ లభించింది. అంత చిన్న వయసులోనే నిజాయితీని చాటుకున్న ఆ బాలుడు, ఆ ట్యాబ్‌ను హుజురాబాద్ సిఐ కరుణాకర్ కి అందజేశాడు. విద్యార్థి ప్రదర్శించిన నిజాయితీని పలువురు అభినందిస్తున్నారు. పోలీస్ స్టేషన్ కు తగిన వివరాలతో వచ్చి ట్యాబ్ ను తీసుకోవాలని సిఐ తెలిపారు.

ప్రభుత్వ కళాశాలలను సద్వినియోగం చేసుకోవాలి

-- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఆంజనేయ రావు

జమ్మికుంట/హుజూరాబాద్, ప్రభాత వార్త:

ప్రభుత్వ కళాశాలలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఆంజనేయ రావు తెలిపారు. హుజూరాబాద్‌లోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను కరీంనగర్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వి. ఆంజనేయరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలలోని ప్రథమ సంవత్సరం విద్యార్థులతో ముచ్చటించి, వారి విద్యాభ్యాస స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల కోసం మెరుగైన మౌళిక సదుపాయాలను కల్పిస్తోందని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో, పట్టుదలతో చదివితేనే ఉన్నత లక్ష్యాలను సాధించగలరని ఉద్బోధించారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరు కావాలని, అడ్మిషన్ పొందిన విద్యార్థులలో ఎవరైనా ఇంకా ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ సమర్పించని వారు ఉంటే, వెంటనే వాటిని కళాశాల యాజమాన్యానికి అందించాలని ఆదేశించారు. ప్రథమ సంవత్సరంలో ఇంకా ప్రవేశాలు కొనసాగుతున్నాయని, విద్యార్థులు తమ సమీపంలోని వారికి కూడా ఈ విషయాన్ని తెలియజేసి, వారిని ప్రభుత్వ కళాశాలలో చేర్పించేలా ప్రోత్సహించాలని కోరారు. అనంతరం ఆయన కళాశాలలోని మౌళిక వసతులను పరిశీలించి, విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ తులసిదాస్, అధ్యాపకులు వానుదేవరావు, రాజశేఖర్, విజేందర్ రెడ్డి, రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.



హుజూరాబాద్ వార్త



ఎం జె పి గురుకులాలకు ప్రక్క భవనాలు నిర్మించాలి..

సిపిఎం జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి డిమాండ్..

జమ్మికుంట / హుజూరాబాద్, ప్రభాతవార్త:

కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గంలోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల విద్యాసంస్థలకు పక్కాభవనాలు నిర్మించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హుజురాబాద్ లో ఉన్న బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ నియోజవర్గంలో సైదాపూర్, వీణవంక మండలాల కేటాయించిన బీసీ గురుకుల పాఠశాల పక్కా భవనాలు హుజురాబాద్ కేంద్రానికి మార్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గురుకుల విద్యాసంస్థలను అభివృద్ధి చేస్తామని మాటలకే పరిమితం అవుతున్నారని, ఆచరణలో విఫలం అవుతున్నారన్నారు. బాలికల గురుకుల పాఠశాలలో కరెంటు సమస్య ఉందని, బయట వైర్లు ఉండడం వల్ల విద్యార్థులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. తరగతి గదులు లేక వరండాలో క్లాసులు నిర్వహిస్తున్నారని, వెంటనే తరగతి గదులు నిర్మించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. 465 మంది విద్యార్థులతో ఈ గురుకుల పాఠశాల నడుస్తుందని, ప్రతి సంవత్సరం మంచి మార్కులతో విద్యార్థినిలు ఉత్తీర్ణులు అవుతున్నారు. పాఠశాల చుట్టుపక్కల ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. గతంలో ఇరిగేషన్ శాఖలో ఉన్నటువంటి ఈ పాత బిల్డింగ్ విద్యార్థులకు అసౌకర్యంగా ఉందని అన్నారు. ఇక్కడ పక్క భవనాలు లేకపోవడం వల్ల ఇక్కడి కళాశాలలను వేరేచోట అద్దె భవనాలు తీసుకొని తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకొని ఈ గురుకుల పాఠశాలకు పక్క భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గురుకుల పాఠశాలలో పనిచేసే ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ పర్మనెంట్ చేయాలన్నారు. పైన పేర్కొన్న సమస్యలన్నీ ప్రభుత్వం పరిష్కరించాలని లేనియెడల దిశలీ పార్టీ ఆధ్వర్యంలో పసలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కొప్పుల శంకర్, మండల కమిటీ సభ్యులు ప్రతాప శ్రీనివాస్, ఇమ్మడి దేవయ్య, కొంకటి చంద్రయ్య, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వడ్లూరి కిషోర్, పట్నం జిల్లా నాయకులు సతీష్, అజ్జు, కుమార్, శ్రీకాంత్, రాజు లతో పాటు పలువురు పాల్గొన్నారు.



బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్రావు,ఎస్సి మోర్చ అధ్యక్షుడు క్రాంతి కుమార్ లను మర్యాదపూర్వకంగా కలిసిన రాజేష్ ఠాకూర్...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త:

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించగా ఈ సమావేశంలో జమ్మికుంట పట్టణానికి చెందిన బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు రాజేష్ ఠాకూర్ పాల్గొని పార్టీ బలోపేతానికి సంబంధించిన పలు అంశాలపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు,రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు క్రాంతి కుమార్ లను మర్యాదపూర్వకంగా కలిసి చర్చించారు.కరీంనగర్ జిల్లాలోని పార్టీ కార్యకలాపాలు, ప్రజా సమస్యలు, సంస్థాగత బలోపేతంపై వివరించారు. ఈ సందర్భంగా నాయకులు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న కార్యకర్తలను అభినందిస్తూ, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.ఈ సందర్భంగా రాజేష్ ఠాకూర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా కృషి చేస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నుంచి మరిన్ని అభివృద్ధి నిధులు, మౌలిక వసతుల ప్రాజెక్టులు, సంక్షేమ కార్యక్రమాలు తీసుకురావడంలో పార్టీ నాయకత్వంతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం పనిచేస్తామని తెలిపారు.రానున్న రోజుల్లో బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడం, యువత, మహిళలు, ఎస్సీ వర్గాల భాగస్వామ్యాన్ని పెంచడం, కేంద్ర ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తామని రాజేష్ ఠాకూర్ స్పష్టం చేశారు.



స్మశానవాటిక దుస్థితిపై సీపీఐ ఆందోళన

రూపాయి అంత్యక్రియల పథకం వెంటనే పునరుద్ధరించాలి

ఖని స్మశానవాటికను సందర్శించిన సీపీఐ నాయకులు

గోదావరిఖని, ప్రభాతవార్త:

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని ఖని స్మశానవాటిక దయనీయ స్థితిలో ఉందని, ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కూడా అందుబాటులో లేవని సీపీఐ నాయకులు ఆరోపించారు. సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో గురువారం ఖని స్మశానవాటికను పరిశీలించిన రాష్ట్ర సమితి సభ్యుడు గోశిక మోహన్, నగర కార్యదర్శి కే. కనకరాజ్, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య సమస్యలను పరిశీలించి అధికారుల నిరక్ష్యంపై తీవ్ర విమర్శలు చేశారు.స్మశానవాటికకు వెళ్లే ప్రధాన రహదారి తవ్వకాలు చేసి నెలలు గడిచినా పూర్తి చేయకపోవడంతో అంత్యక్రియలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు. గంగానగర్ ఫ్లైఓవర్ నుంచి స్మశానవాటిక వరకు, అలాగే లోపలి ప్రాంతంలో కూడా విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో అంత్యక్రియలు నిర్వహించడం ప్రమాదకరంగా మారిందన్నారు.స్మశానవాటికలో గతంలో ఏర్పాటు చేసిన నీటి పంపులు పనిచేయకుండా నిరుపయోగంగా మారాయని, నీటి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చెట్ల పొదలు, ముళ్లకంపలు, చెత్తాచెదారంతో స్మశానవాటిక అపరిశుభ్రంగా మారి పాములు సంచరించే పరిస్థితి నెలకొన్నందున ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.రూ.30 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన విద్యుత్ దహన



యంత్రం నిర్వహణ లేక తుప్పు పట్టి శిథిలావస్థకు చేరిందని, కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే దానిని మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.గతంలో అమలులో ఉన్న ఖిరూపాయి అంత్యక్రియల పథకంఖిను నిలిపివేయడం వల్ల పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టర్ల బిల్లులను వెంటనే చెల్లించి, రూపాయి అంత్యక్రియల పథకాన్ని తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు.మంచిర్యాలలోని ఖిమహాప్రస్థానంఖి తరహాలో ఆధునిక స్మశానవాటికను రామగుండంలో నిర్మించాలని, ప్రస్తుతం ఉన్న స్థలం సరిపోని కారణంగా అదనపు భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ పరిశీలనలో సీపీఐ నాయకులు మాటేటి శంకర్, శనిగరపు చంద్రశేఖర్, తొడుపునూరి రమేష్ కుమార్, అబ్దుల్ కరీం, కలువల జగన్, పోతరాజు నాగరాజు, సాధుల శివ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి బాధ్యతను మరింత పెంచుతుంది

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

ఏఎస్ఐల నుండి ఎస్ఐలుగా పదోన్నతి పొందిన

అధికారులకు భుజాలపై చిహ్నాల అలంకరణ

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:

పదోన్నతి బాధ్యతను మరింత పెంచుతుంది అని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏ ఎస్ ఐలుగా విధులు నిర్వహిస్తూ ఎస్ ఐలుగా పదోన్నతి పొందిన ఎ సత్తయ్య, పి వెంకన్న, ఎం ఏ హబీబ్ రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వారి భుజాలపై పదోన్నతి చిహ్నాలను అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామగుండం పోలీస్



కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిరంతరం పనిచేసే పోలీసు శాఖలో పదోన్నతి పొందిన ప్రతి పోలీసు అధికారిపై బాధ్యత మరింత పెరుగుతుందని, అప్పగించిన విధులను సమర్థవంతంగా, నిజాయితీతో, నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు. పదోన్నతి పొందడం ప్రతి ఉద్యోగికి గర్వకారణమని, అయితే దానితో పాటు బాధ్యత కూడా మరింత పెరుగుతుందని అన్నారు. విధుల్లో ఎల్లప్పుడూ నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తూ ఉన్నతాధికారుల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని ఆదేశించారు.

చెత్తను తడి పొడి చెత్తగా వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలి

మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య పిలుపు

పెద్దపల్లి, ప్రభాతవార్త:

చెత్తను తడి పొడి చెత్తగా వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలి అని మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య పిలుపునిచ్చారు. గురువారం 18వ వార్డు ఈద్గా కాలనీలో శానిటేషన్ పనులను మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్, నాయకులు చైర్మన్ ను శాలువాతో సన్మానించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు 18వ వార్డు అభివృద్ధికి గాను 1 కోటి 38 లక్షల రూపాయలు కేటాయించారని, త్వరలోనే ఈ పనులు



ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే 18వ వార్డు ప్రజలు ఇండ్లలో వచ్చే చెత్తను తడి, పొడి చెత్తగా వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి అందించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కొలిపాక సంపత్, వార్డ్ ఆఫీసర్ సాయి చరణ్, సానిటరీ ఇన్స్పెక్టర్ పులిపాక రాజు, జవాన్ బొంగోని అనిల్, ఎలక్ట్రీషియన్లు అనాసి శ్రీకాంత్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో 100శాతం చేసిన బిఎల్ఓలకు సన్మానం

తహసీల్దార్ వనజా నాయక్

ఓదెల, ప్రభాతవార్త: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేసి, ఒక్క అర్హుడైన ఓటరు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ వనజా నాయక్ అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా ఓదెల మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఎస్ఐఆర్ ప్రక్రియ సమీక్షా సమావేశంలో తహసీల్దార్ వనజ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు ప్రభుత్వం ఎస్ఐఆర్ ప్రక్రియ గడువును ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించిన నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక దృష్టి సారించి



ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా 100 శాతం పూర్తి చేసిన ఓదెల గ్రామానికి చెందిన బీఎల్ఓలు స్వరూప, సుమలత, రమాదేవిలను తహసీల్దార్ వనజా నాయక్, ఎంపీడీఓ అనిల్ రెడ్డి, సర్పంచ్ కనికిరెడ్డి సతీష్‌లు ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వెంకట లక్ష్మణ్, వార్డు సభ్యుడు దూలం సదానందం, బీఎల్ఓలు స్వరూప, సుమలత, రమాదేవి, లావణ్య, రమా, చంద్రమోళి తదితరులు పాల్గొన్నారు.

రామ్మోహన్‌రావును పరామర్శించిన బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జి భోగ శ్రావణి

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

పట్టణంలో ధరూర్ క్యాంప్ 12వ వార్డ్ మాజీ కౌన్సిలర్ వొద్ది లత భర్త రామ్మోహన్ రావు అనారోగ్యంతో జగిత్యాల పట్టణంలోని ఓ ప్రవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఉండగా వారిని కలిసి పరామర్శించిన బిజెపి జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా బోగ శ్రావణి...



పెద్దపల్లి వార్త



ఎల్‌నినో ప్రభావం ఆరుతడి పంటలు మేలు

జూలపల్లి,ప్రభాతవార్త:

జూలపల్లి మండలంలోని జూలపల్లి, చీమలపేట, వెంకట్రావుపల్లి



గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎల్ నినో ప్రభావం మీద అవగాహన సదస్సులు నిర్వహిం చారు. ఈ కార్యక్రమం జూలపల్లి గ్రామ పంచాయతీ ఆవ రణలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎంఏఓ టి. ప్రత్యూష మాట్లాడుతూ, రానున్న రోజుల్లో ఎల్ నినో వల్ల కలిగే వాతావరణ మార్పులను అంచనా వేస్తూ, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా నీటి వనరుల లభ్యత తక్కువగా ఉన్నందున,రైతులు ఆరుతడి పంటల సాగును చేపట్టడం వల్ల పెట్టుబడి భారం తగ్గి,ఆశించిన దిగుబడులు పొందవచ్చని వివరించారు.వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటి అవసరమున్న ఆరుతడి పంటలను ఎంచుకోవాలని సూచించారు.సాగునీటిని వృధా చేయకుండా,అందుబాటులో ఉన్న నీటి వనరులను సక్రమంగా నిర్వహించుకోవాలని మిషన్ భగీరథ,ఇరిగేషన్ ఏఈలు రైతులకు పిలుపునిచ్చారు. ఈ అవగాహన సదస్సులో ఏఓ టి.ప్రత్యూష,ఎఎంసి చెర్మెన్ కొమ్మ పోచాలు,మిషన్ భగీరథ ఏఈ ,ఇరిగేషన్ ఏఈ శ్రీధర్, ఏఈఓ లు డి.శ్రీవాణి,కిరణ్మయి,రాకేష్ రైతులు పాల్గొని,అధికారులు వివరించిన సాగు మెళకువలపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

సాంకేతికతతో సక్సెస్.. ఐదు మొబైళ్లు బాధితుల చేతికి.....

పోగొట్టుకున్న ఫోన్లు తిరిగి అందించిన సుల్తానాబాద్ పోలీసులు.

ఫిర్యాదు చేస్తే ఫోన్ తిరిగి దొరుకుతుంది

సీఐ రంజిత్ రావు

సుల్తానాబాద్,ప్రభాతవార్త:



పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి వాటిని తిరిగి యజమానులకు అందజేస్తూ సుల్తానాబాద్ పోలీసులు ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు. సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు చేసిన ఫిర్యాదుల మేరకు, సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సి ఈ ఐ ఆర్) పోర్టల్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి గుర్తించిన ఐదు మొబైల్ ఫోన్లను సీఐ రంజిత్ రావు, ఎస్ఐ చంద్రకుమార్ గురువారం సంబంధిత యజమానులకు అప్పగించారు.ఈ సందర్భంగా సీఐ రంజిత్ రావు మాట్లాడుతూ, ప్రజలు మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో లేదా సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేస్తే మొబైల్ ఫోన్‌ను సాంకేతిక సహాయంతో గుర్తించి తిరిగి అప్పగించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోన్‌కు సంబంధించిన ఐఎంఈఐ నంబర్‌ను భద్రంగా నమోదు చేసుకోవాలని, ఫోన్ పోయిన వెంటనే ఆలస్యం చేయకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు.మొబైల్ ఫోన్ల గుర్తింపులో విశేష కృషి చేసిన కానిస్టేబుల్ అరుణ్ కుమార్‌ను సీఐ ప్రత్యేకంగా అభినందించారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు తిరిగి లభించడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తూ సుల్తానాబాద్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

తీవ్రవార్షాభావ పరిస్థితులు రైతులు అధికారుల సూచనలు పాటించాలి

రేవల్లి సర్పంచ్

బంగారపు అజయ్ కుమార్

చొప్పదండి,ప్రభాతవార్త:



ఎల్ నినో ప్రభావం తో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడినందున, రైతులు అధికారులు ఇచ్చే సూచనల మేరకు పంటలను వేసుకోవాలని రేవెల్లి గ్రామ సర్పంచ్ బంగారపు అజయ్ కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం చొప్పదండి మండలంలో ని కోనేరు పల్లె, రేవెల్లి గ్రామాలలో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం వలన మండలంలో తక్కువ వర్షపాతం నమోదు అయినదని నీటి లభ్యత సరిపడా చూస్కుని వరి నాట్లు వేసుకోవాలని తెలిపారు. నీరు తక్కువగా అవసరమయ్యే పంటలు పెసర,కంది, మొక్కజొన్న , కూరగాయలు లాంటి ఆరుతడి పంటలు వరి పంటకు ప్రత్యామ్నయంగా వేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ అధికారులు సమావేశాలు నిర్వహించారు.సమావేశంలో ఎ ఇ ఒ లు కవిత, యోగేశ్వర్, అధికారులు, సర్పంచ్ కొనేరుపల్లే కాసు వేణుగోపాల్, రేవెల్ళి సర్పంచ్ బందారపు అజయ్ కుమార్, ఉపసర్పంచ్ ఇ. అంజయ్య, వర్డ్ సభ్యులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఎల్ ని వో ప్రభావం తో రైతులు ఆరుతడి పంటల సాగు ఉత్తమం

ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుధాకర్

మల్యాల/ ప్రభాతవార్త



మల్యాల మండలంలోని పోతారంలో గురువారం ఎల్ ని వో వల్ల ఏర్పడ్డ పరిస్థితులలో రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించి లాభాలను గడించాలని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ జాన్ సుధాకర్ అన్నారు, గ్రామపంచాయతీలో ఈ సందర్భంగా రైతులతో వివిధ పంటలపై అనుసరించాల్సిన పద్ధతుల పై అవగాహన కల్పించారు, తర్వాత వరి పొలాలు, ఈ సీజన్లో కందులు,ఫామ్ ఆయిల్ తోటలు, మొక్కజొన్న సాగు మేలని, ఈ మేరకు గ్రామంలో విత్తిన పొలాలు ఆయిల్ ఫామ్ తోటల క్షేత్ర సందర్శన నిర్వహించారు, తక్కువ వర్షాలు, ఎల్ నినో ప్రభావము వల్ల రైతులు ఆరుతడి, చిరుధాన్యాలు కూరగాయ పంటలు వేసుకోవాలన్నారు, ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చంద్ర దీపక్, ఏఈఓ శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి రామ్మోహన్రావు, సింగిల్ విండో డైరెక్టర్ సుధాకర్ రెడ్డి ముత్యాల ఆదిరెడ్డి, మల్హల్ రావు , దండే గంగాధర్ , తుంగతుర్తి రామారావు ,కొండపల్కుల ఆనంద రావు తోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలి

జగిత్యాల జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిరఘువరన్

మల్యాల /ప్రభాతవార్త



నీటి వనరులను సంరక్షి ంచుకొని భూగర్భ జలాల పెంపునకు చేపట్టే కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జగిత్యాల జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రఘువరన్ అన్నారు, గురువారం మల్యాల మండలం ఓబులాపూర్ గ్రామంలో జలసిరి కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు ఇంటింటికి మొక్కల పంపిణీ తో పాటు, ఎస్సీ కాలనీలో బోరు వద్ద రీఛార్జ్ పనులను ప్రారంభించి అంగడి బోరు గుట్ట వద్ద మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు, అనంతరం మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతలు కమ్యూనిటీ ఇంకుడు గుంతలు ఫామ్ పాంట్స్ నూతన భవన నిర్మాణాల వద్ద ఊట గుంటలు ఇతర నీటి సంరక్షణ కార్యక్రమాలలో ప్రజలు బాధ్యతగా భాగస్వాములు కావాలని కోరారు, జల సంరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, నీటిని వృధా కాకుండా నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు, కార్యక్రమంలో ఎంపీడీవో స్వాతి, ఏపీవో శ్రీనివాస్, ఈసీ మనోజ్, సర్పంచ్ గ్యాదం కుమార్, ఉప సర్పంచ్ పొన్నం మల్లేశం, కార్యదర్శి కిరీటి, టి ఏ లావణ్య ఫీల్డ్ అసిస్టెంట్ రాజు, అంగన్వాడి టీచర్లు వార్డు సభ్యులు పాల్గొన్నారు,

తెలంగాణ అభివృద్ధి బిజెపి తోనే సాధ్యం

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్

చొప్పదండి,ప్రభాతవార్త:



తెలంగాణ అభివృద్ధి కేవలం భారతీయ జనతా పార్టీతోనే సాధ్యం అవుతుందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు చొప్పదండి మండలంలోని కొలిమి కుంట గ్రామంలో గురువారం బీజేపీ మండల అధ్యక్షులు మొగిలి మహేష్ ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనటువంటి మేకల ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ బూత్ స్థాయి నుండి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త పనిచేయాలని కార్యకర్తల యొక్క అంకితభావమే పార్టీకి శ్రీరామరక్ష అని అన్నారు. రాగంపేట రేవెల్లి పెద్ద చెరువుకు ఎల్లంపల్లి పైపులైను ఏర్పాటు చేసి శాశ్వత నీటి సౌకర్యం కల్పించాలి మరియు బీరం పల్లె రాగంపేట వద్ద చెడిపోయిన ఎల్లంపల్లి పైపులైనుకు గేటు వాల్ రిపేర్ చేయించి కోమటికుంటను నింపి దళితవాడకు, 1200 ఎకరాల ఆయకట్టుకు నిరంధించాలన్నారు. రాగంపేట రేవెల్లె పెద్ద చెరువును రిపేర్ చేయించి ఆర్నకొండ మెరప చెరుకు నిరంధించాలని, మండలంలోని భూపాలపట్నం నుండి వెదురుగట్ట వెళ్లే దారిలో ఎస్సారెస్పీ బ్రిడ్జి కూలిపోయినది దానిని వెంటనే నిర్మించాలనీ, మండలంలోని చెడిపోయిన రోడ్లను వెంటనే రిపేర్ చేయించాలన్నారు. ఆర్నకొండ, చొప్పదండి పట్టణంలో ఉన్నటువంటి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను వెంటనే అర్హులైన వారికి కేటాయించి, కనీస సౌకర్యాలు నీళ్లు, కరెంటు తదితర సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్షీ ్మనారాయణ , జిల్లా కార్యవర్గ సభ్యులు గొల్ల గట్టయ్య, మండల ప్రధాన కార్యదర్శిలు కొమ్ము రమేష్, ఎడ్ల సురేష్, ఉప సర్పంచ్ సముద్రాల సాయికిరణ్, మాజీ ఎంపిటిసి సభ్యులు తోట కోటేష్, మాజీ సర్పంచ్ గుంట రవి, గుడిపాక సురేష్, మాజీ ఉపసర్పంచ్ బైరగోని కిట్టు గౌడ్, మాజీ అసెంబ్లీ కన్వీనర్ మొగిలి సారయ్య, ఉపాధ్యక్షులు సింగసాని కనకయ్య, కార్యదర్శి కాయిత సాయి, ఐద మారుతి, గుండె వెంకటేష్ , గాండ్ల సతీష్, ముద్దసాని వినయ్, మాచర్ల శశి, దొంతిసారపు సంపత్, తాటికొండ కుమార్, ఒరుగుల తిరుపతి, బద్దనపల్లి లచ్చయ్య, జక్కుల అంజయ్య, పంజాల నిరంజన్, మధుసూదన్ రెడ్డి, పాలోజి వెంకటరమణ, తాళ్లపల్లి రవి, చీకట్ల శ్రీకాంత్, రాపెల్లి శ్రీనివాస్, మడ్డి పరుశురాం, కస్తూరి మహేష్, పంబాల శ్రీనివాస్, గసిగంటి రవి, మేకల రాములు, రాచకొండ ఉమేష్, మాజీ సర్పంచ్ తోట ప్రభాకర్ రెడ్డి, కంకణాల సాయి వరుణ్ రెడ్డి, చీకట్లఆకాష్, నెల్లి అనిల్, చుక్కల అనిల్, లక్షీ ్మనారాయణ, సత్తు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చొప్పదండి

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



మల్యాల/ ప్రభాతవార్త పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, అర్హులైన పేదలందరికి సంక్షేమ ఫలాలను అందించడమే తమ ధ్యేయమని కరీంనగర్ డిసిసి అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు, గురువారం సాయంత్రం మల్యాల మండల కేంద్రంలో కళ్యాణ లక్షి ్మ, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను ఆయన అందజేశారు, కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో స్వాతి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ తో పాటు మండలంలోని పలువురు సర్పంచులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు,



మా రక్తం ఇచ్చాము.... మీ దాహం తీర్చుకోండి

రైతులకు మాత్రం నీళ్లు ఇవ్వండి

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు ఏనుగు రవీందర్ రెడ్డి

చొప్పదండి,ప్రభాతవార్త:



రైతుల పంటలపై బి ఆర్ ఎస్ నేతల రక్తాన్ని చల్లాలంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్న మాటలకు నిరసనగా గురువారం రామగుండం డిజిటల్ సభ్యత్వ నమోదు ఇంచార్జ్, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి రక్తం ఇస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి హోదాలో ఉంది కూడా పైశాచికంగా మాట్లాడడం దారుణం అని పేర్కొన్నారు. రైతుల పంటలపై మా రక్తాన్ని చల్లాలన్న రేవంత్ రెడ్డి మాటలకు స్పందించి రక్తాన్ని ఇచ్చామని, కానీ ముఖ్యమంత్రి గా మీరు రైతుల పంటలకు మాత్రం నీళ్లు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. రైతులకంటే మా రక్తం ఏమి ఎక్కువ కాదని అందుకే ముఖ్యమంత్రి అన్నట్లు రక్తం ఇచ్చాము మీరు మాత్రం రైతుల పంటలకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాలేశ్వరం నీళ్లను వృధా చేస్తున్న మీరు ఇప్పటికైనా మోటార్లు పెట్టి రైతులకు నీళ్లు అందించాలని రవీందర్ రెడ్డి డిమాండ్ చేశారు.

కన్నెపల్లి పంపు ద్వారా గాయత్రి పంప్ హౌస్ నీళ్లు ఇవ్వాలి

మిడ్ మానేరును తక్షణమే నింపాలి

మా రక్తం కావాలన్నావు రేవంత్.... ఇదిగో ఇచ్చాము

రైతాంగానికి నీళ్లు ఇవ్వాల్సిన బాధ్యత మీదే

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర,ప్రభాతవార్త:



అల్లాడి పోతున్న రైతాంగానికి నీళ్లు ఇవ్వాలని కోరితే బిఆర్ఎస్ పార్టీ నేతల రక్తాన్ని ఇస్తే రైతుల పంట పొలాలపై రక్తాన్ని చల్లుతామంటూ ప్రగల్భాలు పలికిన రేవంత్ ఇప్పుడు నీవు రైతులకు నీళ్లు ఇచ్చే ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కోరారు. ఈ మేరకు రేవంత్ రెడ్డి బిఆర్ఎస్ నేతల రక్తాన్ని ఇవ్వాలని రైతుల పంట పొలాలపై చల్లుతామని అన్న మాటలకు నిరసనగా గురువారం గంగాధర మండల కేంద్రంలో రవిశంకర్ ఆధ్వర్యంలో నిరసనగా బి ఆర్ ఎస్ నేతల నుండి రక్తాన్ని సేకరించే కార్యక్రమాన్ని నిర్వహించారు. సేకరించిన రక్తాన్ని ముఖ్యమంత్రికి పంపుతున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ తెలంగాణ రాకముందు కాంగ్రెస్ పాలనలో రైతుల ఆత్మహత్యలు ఎలాగ ఉన్నాయో తెలంగాణ వచ్చిన తర్వాత కెసిఆర్ పాలనలో సుభిక్షంగా ఉన్న రైతులు నేడు మళ్లి కాంగ్రెస్ పాలనలో ఆత్మహత్యల వైపు పయనిస్తున్నారని విమర్శించారు. కన్నె పెళ్లి నుండి నంది పంపు ద్వారా గాయత్రి పంపు హౌస్ కు, మిడ్ మానేరు తో పాటు తెలంగాణ వ్యాప్తంగా తాగు, సాగు మీరు అందించాలని రవిశంకర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాల సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, సర్పంచ్ లు, మాజీ సర్పంచులు, మండల పార్టీ అధ్యక్షులు, ఆరు మండలాల నాయకులు పాల్గొన్నారు.

రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా

.రుద్రంగి ప్రభాత వార్త :

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 8 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రుద్రంగి ప్రాంతంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న లోవోల్టేజ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అధికారులతో సమన్వయం చేసి 5 ఎంవిఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో మరో 8 ఎంవిఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించినట్లు పేర్కొన్నారు. వేములవాడ నియోజకవర్గంలో గత రెండున్నర సంవత్సరాల కాలంలోనే 13 నూతన సబ్‌స్టేషన్లు మంజూరు చేయించడం ఒక రికార్డు అని తెలిపారు. రుద్రంగి, నూకలమర్రి, ఎన్గల్, లింగంపేట, మరిమడ్ల, పోసానిపేట, సిరికొండ, భీమారం, కాచారం, పోరుమల్ల తదితర ప్రాంతాల్లో 33/11 కెవి సబ్‌స్టేషన్లు మంజూరు చేయడం లేదా నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. కథలాపూర్‌లో రూ. కోట్ల వ్యయంతో 220 కెవి భారీ సబ్‌స్టేషన్ నిర్మాణం కొనసాగుతోందని వెల్లడించారు. రైతులకు విద్యుత్ కనెక్షన్ల కోసం గతంలో భారీ మొత్తాలు ఖర్చు చేయాల్సి వచ్చేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై భారం తగ్గిస్తూ



కిలోమీటర్ వరకు విద్యుత్ లైన్, అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్ వంటి పథకాల ద్వారా రైతాంగ సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వర్షాభావ పరిస్థితులు, విద్యుత్ వినియోగం పెరిగినప్పటికీ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ శాఖ అధికారులు నిరంతరం పనిచేస్తున్నారని పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తి పెంపుతో పాటు అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి కూడా విద్యుత్ కొనుగోలు చేసి రైతులకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రైతులకు ఎక్కడ ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వేములవాడ నియోజకవర్గ అభివృద్ధి, రైతాంగ సంక్షేమం కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వెల్లడించారు. విద్యుత్ అధికారులు మాట్లాడుతూ.. రుద్రంగి సబ్‌స్టేషన్‌లో గతంలో 5 ఎంవిఏ మరియు 8 ఎంవిఏ ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రమే ఉండేవని, పెరుగుతున్న విద్యుత్ వినియోగం కారణంగా లోవోల్టేజ్ సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో అదనంగా మరో 8 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించి ఏర్పాటు చేయడం వల్ల ప్రస్తుతం రెండు 8 ఎంవిఏ ట్రాన్స్‌ఫార్మర్లతో విద్యుత్ సరఫరా మరింత బలోపేతం అయిందన్నారు. ఒక ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక సమస్య తలెత్తినా మరో ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కొనసాగించవచ్చని వెల్లడించారు. అదేవిధంగా రుద్రంగి ప్రాంతానికి 132 కెవి సబ్‌స్టేషన్ మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే కీలక పాత్ర పోషించారని, లింగంపేట, నర్సింగాపూర్ తదితర ప్రాంతాల్లో 33/11 కెవి సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. వేములవాడ నియోజకవర్గంలో ఇప్పటివరకు 2,800కు పైగా మిడిల్ పోల్స్ ఏర్పాటు చేయడం, రైతులకు అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు వేగంగా అందించడం జరిగిందన్నారు. గత ఏడాదిలోనే 1,300 మంది కొత్త రైతులకు విద్యుత్ కనెక్షన్లు అందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గండి నారాయణ, ఏఎంసీ చెర్మెన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రం గంగనర్సయ్య నాయకులు గడ్డం శ్రీనివాస్, కొమిరె శంకర్, పల్లి గంగాదర్, పూదరి మహిపాల్, అల్లూరి లచ్చిరెడ్డి, ఎల్లాల రాజారాం, ఎల్లాల లక్ష్మతి, అక్కెనపల్లి శ్రీనివాస్, అంబాటి శ్రీనివాస్, పిట్టల స్వామి, దయ్యాల శ్రీనివాస్, దేశవేని భూమేష్, తదితరులు పాల్గొన్నారు.

కరెంటు కోతలు.. రోడ్డెక్కిన రైతులు - కరెంట్ లేక ఎండుతున్న వరి నార

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందక పంటలు ఎండిపోతుండటంతో రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని నిజామాబాద్, కనగర్తి గ్రామాల రైతులు ఆందోళనకు దిగారు. వరి నాట్ల సీజన్‌లోనూ విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో గురువారం సిరిసిల్ల నుండి కోనరావుపేటకు వెళ్లే ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో రోడ్డుపై వాహనాలు నిలిచిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రెక్కలు ముక్కలు చేసుకుని రైతులం పంటలను సాగు చేసుకుంటే కళ్లముందే ఎండిపోతున్నా విద్యుత్ శాఖ అధికారులు



పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో నాణ్యమైన విద్యుత్ అందించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం, విద్యుత్ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. విద్యుత్ సమస్యలతో పాటు వ్యవసాయ మందులు, ఎరువులు కూడా మార్కెట్‌లో సకాలంలో అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు వాపోయారు. పెట్టుబడులు రోజురోజుకూ పెరుగుతున్నా సాగుకు అవసరమైన వనరులు అందక నష్టాల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ధర్నా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. అయితే, ఉన్నతాధికారులు స్వయంగా వచ్చి విద్యుత్ సరఫరాపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించబోమని రైతులు స్పష్టం చేశారు. రైతుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

వర్షాలు లేక ఎండుతున్న నారు మడులు

రుద్రంగి ప్రభాత వార్త :

నెల రోజులుగా అనుకున్నంత వర్షం పడకపోవడంతో రైతులు అందోళన చెందుతున్నారు. వర్షాలు కురువక చెరువులు, కుంటలు నీళ్లు లే కవెలవెల బోతున్నాయి. రుద్రంగి మండల కేంద్రంలో ప్రస్తుత వర్షాభావ పరిస్థితులకు తోడు కరెంటు కోతలతో నారు మడులు ఎండిపోతున్నాయిని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు లేక ఇప్పటికే పంటలు వెనుకబడ్డాయని ఉన్న నీటితో పంటలు వేద్దం అనుకుంటే ప్రభుత్వం రైతులకు నాణ్యమైన



విద్యుత్ అందించాల్సింది పోయి ప్రభుత్వం కరెంటు కోతలు ఎక్కువ చేస్తుందన్నారు. ఇష్టానుసారంగా కరెంటు కట్ చేయడంతో నారుమడులతో పాటు దుక్కులకు నీరు అందక ఎండుతున్నాయని రైతులు వాపోతున్నారు. వ్యవసాయానికి 3 ఫేజ్ కరెంటు 6 గంటలు కూడా ఇవ్వడం లేదన్నారు. విద్యుత్ సరాఫర ఎందుకు నిలిపివేశారని విద్యుత్ సిబ్బందిని ఫోన్ ద్వారా రైతులు అడుగగా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకే విద్యుత్ సరాఫర నిలిపి వేశామని తెలపడంతో రైతులు అగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, అధికారులు స్పందించి రైతులకు ఎలాంటి కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించాలని రైతులు కోరుతున్నారు.

ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి

చందుర్తి ప్రభాతవా

ఎల్ నినో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని చందుర్తి మండల వ్యవసాయ అధికారి దుర్గరాజు అన్నారు, టిఆర్వీకే శాస్త్రవేత్త సాయికుమార్ ఆధ్వర్యంలో గురువారం వ్యవసాయ కళాశాల విద్యార్థులతో కలసి బండపల్లి గ్రామంలో వ్యవసాయ క్షేత్ర ప్రదర్శన చేపట్టారు ఎల్ నినో ప్రభావం వల్ల నీటి వనరులు తగ్గదల ఉండడంతో బావులు, బోర్లలో నీళ్లు తగ్గే అవకాశం ఉందని కావున ఆరుతడి పంటలు వేయాలని సూచించారు. రాబోవు కాలం లో నీటి ఎద్దడి తీవ్రత పెరిగే అవకాశం ఉంది. దీంతో రైతులు జొన్న, పెసళ్ళు, మినుములు, కంది, పొద్దుతిరుగుడు, ఆముదం పంటలు వేయాలని సూచించారు.

వేములవాడ వార్త

అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ గృహాలు



చందుర్తి/ ప్రభాతవార్త

గ్రామాలలో అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ గృహాలను మంజూరు చేస్తామని చందుర్తి మాజీ జడ్పీటీసీ నాగం కుమార్ అన్నారు, చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలో గంగిరెద్దుల కాలనీని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ ఆదేశాల మేరకు గురువారం గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులతో కలిసి సందర్శించారు, ఈ సందర్భంగా గంగిరెద్దుల కాలనీలో 20 కి పైగా కుటుంబాలు గుడిసెల్లో నివసిస్తున్నట్లు ధృవీకరించారు, వీరికి త్వరలోనే గృహాలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి గంట మల్లేశం మాజీ సర్పంచ్ నాగం రాజ మల్లయ్య, వార్డు సభ్యులు టేకుమట్ల ఎల్లయ్య,గొల్ల పల్లి ప్రశాంత్ గౌడ్, గదారాశి రాజు, శంకర్ గౌడ్,పంచాయతీ కార్యదర్శి మారుతి మర్కెట్ కమిటీ డైరెక్టర్ అమరబండ సాయి నాయకులు మనోహర్, పవన్ గౌడ్ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

తెలంగాణ సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ ను కలిసిన డా. పెరుక రాజు

చందుర్తి / ప్రభాతవార్త



ప్రముఖ జాతీయ కవి, రచయిత, బహుభాషావేత్త, ఖిమ్మై గిఫ్ట్‌ఖి స్వచ్ఛంద సంస్థ రూపశిల్పి ఆర్మీ అధికారి డా. పెరుక రాజు గురువారం తెలంగాణ ప్రభుత్వ సైనిక్ వెల్ఫేర్ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ ఎన్. ఆర్. బాలు ను హైదరాబాద్‌లోని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సైనిక సంక్షేమం, సాహిత్యాభివృద్ధి, సామాజిక సేవ తదితర అంశాలపై చర్చించినట్లు రాజు తెలిపారు, దేశ రక్షణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, మరోవైపు తెలుగు తో పాటు పలు భాషల్లో సాహిత్య సేవ, సామాజిక సేవా కార్యక్రమాలను సమన్వయం చేయడం అభినందనీయమని బ్రిగేడియర్ ఎన్. ఆర్. బాలు పేర్కొన్నారు. భవిష్యత్తులో డా. పెరుక రాజు సాహిత్య రంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో మరెన్నో పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఖిమ్మై గిఫ్ట్‌ఖి స్వచ్ఛంద సంస్థ తరఫున డా. పెరుక రాజు బ్రిగేడియర్ ఎన్. ఆర్. బాలు ను శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. భారతమాత గర్వించే తెలంగాణ ముద్దుబిడ్డ డా. పెరుక రాజు ప్రస్తుతం దేశ రక్షణ శాఖలోని ఆర్మీ విభాగంలో జూనియర్ అధికారి గా విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణతో పాటు సాహిత్య సేవను నిరంతరం కొనసాగిస్తూ జాతీయ స్థాయిలో విశిష్ట గుర్తింపు పొందారు. సాహిత్యంతో పాటు సామాజిక సేవలోనూ ఆయన విశేష కృషి చేస్తున్నారు. పేద, అణగారిన వర్గాల అభ్యున్నతిని లక్ష్యంగా పెట్టుకొని స్థాపించిన ఖిమ్మై గిఫ్ట్‌ఖి స్వచ్ఛంద సంస్థ ద్వారా దేశవ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు.



ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

మంథని ప్రభాతవార్త:

తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలం, ఉపాధి, వైద్యం, పెన్షన్‌తో కూడిన సమగ్ర సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం మంథని నాయకులు డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయం ఎదురుగా ఉన్న అమరుల జ్యోతి వద్ద కేకే కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యమకారులతో సంప్రదింపుల ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కరీంనగర్, మంచిర్యాల జిల్లాల ఉద్యమకారులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేకే కమిటీ సభ్యులు కేకే, ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్, రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి పాల్గొన్నారు. మంథనికి చెందిన ఉద్యమకారులు



తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పిడమర్తి రవి ఆదేశాల మేరకు కమిటీ ముందు హాజరై పలు సూచనలు చేశారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని వారు కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలం, నెలకు 25 వేల రూపాయల పెన్షన్, 1000 కోట్ల రూపాయలతో ఉద్యమకారుల కార్పొరేషన్ ఏర్పాటు, ఉచిత వైద్యం, ఉద్యమకారుల పిల్లలకు ఉచిత విద్య వంటి సంక్షేమ పథకాలను అందించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారులకు శాశ్వత సామాజిక భద్రత కల్పించాలని, ఈ ప్రక్రియలో కాలయాపన చేయకుండా సత్వర న్యాయం చేయాలని కమిటీ ముందు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి కావటి సతీష్, మంథని ఉద్యమకారులు మిరాల రామిరెడ్డి, సాదుల శ్రీను, కన్నాల సర్పంచ్ గుడిసె గట్టయ్యయాదవ్,ఎస్ కే ముజీబ్, కోరవేన కుమార్, కాసిపేట మల్లేష్, కట్టేకోళ్ల విజయ్, కాసు ధర్మరాజ్, జావీద్ ఖాన్, పెండెం రాజేష్ తదితరులు పాల్గొన్నారు

భూగర్భ జలాలు 1.5 మీటర్లు తగ్గాయి..

రైతులకు పంటల మార్పిడి పద్ధతులపై అవగాహన

ముత్తారం, ప్రభాతవార్త:

భూగర్భ జలాలు 1.5 మీటర్లు తగ్గాయి... అప్రమత్తంగా ఉండాలి అంటూ మండల వ్యవసాయ అధికారి పిలుపునిచ్చారు. గురువారం ముత్తారం మండలంలోని ముత్తారం, ధర్యాపూర్, హరిపురం గ్రామాల్లో ఎల్నినో ప్రభావం, పంటల మార్పిడి పద్ధతులపై రైతులకు ముమ్మర అవగాహన కల్పించారు. ఈ సదస్సులో మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఈ ఏడాది



ఎల్నినో కారణంగా జూలై, ఆగస్టు నెలల్లో వర్షపాతం గణనీయంగా తగ్గి అసమానంగా పడే ప్రమాదం ఉందన్నారు. 2025 జూలై నెలతో పోల్చితే ప్రస్తుతానికి భూగర్భ జలాలు 1.5 మీటర్ల లోతుకు పడిపోయాయని, వర్షాలు లేక చెరువులు, కుంటలలో సగం నీరు మాత్రమే అందుబాటులో ఉందని తెలిపారు. రైతులు ఈ విపత్కర పరిస్థితులను తట్టుకునేందుకు తక్కువ కాలపరిమితి గల వరి రకాలను ఎంచుకోవాలని కోరారు. అలాగే నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని కందులు, పెసలు, మినుములు, నువ్వులు, జొన్న, సజ్జలు వంటి ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. ఈ అవగాహన సదస్సులో ఆయా గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, ఏఈఈ నితీశ్, పంచాయతీ సెక్రటరీ, వ్యవసాయ విస్తరణ అధికారి కే మనీషా, బి శశిధర్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

మచ్చుపేటలో కప్పతల్లి ఆట...

ముత్తారం, ప్రభాతవార్త:

వరుణ దేవ కరుణించు... వర్షాలు కురిపించు అని మచ్చుపేట గ్రామస్తులు వేడుకున్నారు. ముత్తారం మండలంలోని మచ్చుపేట గ్రామంలో వర్షభావ పరిస్థితుల వల్ల పంటలు ఎండిపోతుండడంతో వానలు సమృద్ధిగా కురవాలని గ్రామస్తులంతా కలిసి కప్పతల్లి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చిలివేరి జ్యోతి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఈ పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వర్షాలు పడక అవస్థలు పడుతున్న కర్షకులకు మేలు జరగాలనే ఉద్దేశంతోనే ఈ పూజా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. వర్షాలు సకాలంలో పడి సాగు నీరు అందాలని, జలాశయాలు జలకళతో నిండాలని దేవతలను వేడుకున్నట్లు చెప్పారు. ఈ పూజల్లో చిలివేరి భూమయ్య, గొర్ల స్వామి, బొడ్డు రాజేశం, ఎలగందుల భూమయ్య, మడ్డి రాజు, గరగంటి



మదనయ్య, తిరుమల రాజు, చిలువే లింగయ్య, కాసులాల్ కుమార్, కీసరి రమేష్, ముత్తే లక్ష్మయ్య, కానిగంటి మొగిలి, తాళ్ల రాయమల్లు, అలిశెట్టి మధుకర్, కంచు రమేష్, కిసారి రాములు, కొట్టే బనాయా, పులిపాక ఓదెలు, లల్లు, యశ్వంత, జానీ, సన్నీ, ఇతర గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతం

రామగిరి ప్రభాతవార్త

రామగిరి మండలంలోని నాగేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ మరియు కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో, గొల్లపల్లి రాయమల్లు తన సతీమణి కీర్తిశేషులు గొల్లపల్లి రమాదేవి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం గురువారం విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తోట్ల తిరుపతి యాదవ్, గ్రామ సర్పంచ్ కొండవేన దివ్య సుధాకర్,హాజరై రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి సంబంధిత అన్ని వ్యాధులకు ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించడంతో పాటు, శస్త్రచికిత్స అవసరమైన రోగులను గుర్తించి కరీంనగర్‌లోని రేకుర్తి కంటి ఆసుపత్రిలో పూర్తిగా ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే రోగులకు ఉచిత రవాణా, భోజనం, మందులు, లెన్స్‌లు మరియు అవసరమైన అన్ని వైద్య సేవలను కూడా ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ అధ్యక్షురాలు డా. శరణ్య యాదవ్ మరియు రేకుర్తి కంటి ఆసుపత్రి టెక్నీషియన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో మొత్తం 70 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 30 మందికి కంటి శస్త్రచికిత్స అవసరమని గుర్తించి, వారికి ఉచిత బస్సు సౌకర్యం కల్పించి కరీంనగర్‌లోని రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా డా. శరణ్య యాదవ్ మాట్లాడుతూ, “తమ ప్రియమైన వారి జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు నిర్వహించడం వారికి అందించే గొప్ప నివాళి అని గొల్లపల్లి రాయమల్లు తన సతీమణి కీర్తిశేషులు రమాదేవి పేరుతో ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయం. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి స్ఫూర్తిదాయకం. లయన్స్ క్లబ్ ద్వారా ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తాము“ అని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా కమిటీ చైర్మన్ మేకల మారుతి యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీ ఉపాధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీ ఎల్లా రామ్మూర్తి, మాజీ ఎంపీపీ ఆరెల్లి కొమురయ్య, మాజీ సర్పంచ్ ఎరుకల ఓదెలు, ఉప సర్పంచ్ యసం సతీష్, గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు తీగల సదయ్య, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు వేగోళపు సంతోష్, యూత్ ఉపాధ్యక్షుడు నాడెం శ్రీనివాస్, భద్రపు శ్రీనివాస్, మైలారం అనిల్, పందుల సోము, రామిని గోపాలకృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేగోళపు రాయమల్లు, మంతిని వెంకన్న, మంతిని లచ్చన్న, నల్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మంథని వార్త



విద్యుత్ ఘాతానికి ఎద్దు మృతి

మంథని రూరల్ ప్రభాతవార్త:

మంథని మండలం గద్దలపల్లి (ధర్మారం) గ్రామానికి చెందిన రైతు పుల్లే సమ్మయ్యకు చెందిన ఎద్దు బుధవారం రాత్రి విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందింది. గ్రామస్థుల వివరాల ప్రకారం, పశువుల కొట్టంలో మేత మేస్తున్న సమయంలో విద్యుత్ ప్రవాహానికి గురైన ఎద్దు అక్కడికక్కడే మృతిచెందింది. మృతిచెందిన ఎద్దు విలువ సుమారు రూ.80 వేల వరకు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. సమాచారం అందుకున్న సంబంధిత అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి విచారణ చేపట్టారు. ఎద్దు మృతితో తీవ్ర నష్టం వాటిల్లిన రైతు పుల్లే సమ్మయ్యను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్థులు అధికారులను కోరారు.

సర్కారు బడులను బలోపేతమే లక్ష్యం



ముత్తారం, ప్రభాతవార్త:

సర్కారు బడులను బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ముత్తారం ఎంపిడిఓ ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. ముత్తారం మండలం హరిపురం గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో స్థానిక విద్యార్థుల తల్లిదండ్రుల కోసం నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సుకు ఎంపిడిఓ ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాలయాల్లో చదివే విద్యార్థులకు నిపుణులైన ఉపాధ్యాయులతో ఉన్నత ప్రమాణాలతో కూడిన ఉచిత బోధన లభిస్తుందని పేర్కొన్నారు. దీనికి తోడుగా రుచికరమైన ఉదయపు అల్పాహారం, పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజన వసతులను కూడా సర్కారే సమకూరుస్తోందని గుర్తుచేశారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించి ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సదస్సులో సర్పంచ్ మెంగని సమత తిరుపతి, ఉపసర్పంచ్ కూస తిరుపతి, పాఠశాల ఉపాధ్యాయురాలు సమత, వార్డు సభ్యులు ఏజ్జు లత తిరుపతి, అడ్డూరి మోహన్, బండారి రవీందర్, ఏగుర్ల జ్యోతి రాజు, యార సునిత రాజిరెడ్డి, గ్రామ సెక్రటరీ సతీష్ గౌడ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే కు ప్రతి ఒక్కరు సహకరించాలి

రామగిరి ప్రభాతవార

భూముల రీసర్వే కు ప్రతి ఒక్కరు సహకరించాలని రామగిరి మండల తహసీల్దార్ సుమన్ అన్నారు. రత్నాపూర్ గ్రామ పంచాయితీ ఆవరణలో గురువారం సర్పంచ్ పల్లె ప్రతిమ వీరాస్వ అధ్యక్షతన భూముల రీసర్వే గ్రామ సభ ని లో రీసర్వే వివరాలను వెల్లడించారు. పన్నూరు, రత్నాపూర్, మేడిపల్లి, లొంకకేసారం, బుధవారంపేట గ్రామాలను ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్ట్ గా ఎంపిక చేసిందన్నారు. మొదటి దశలో గ్రామాల హద్దులు నిర్ణయించడం, రెండో దశలో తారు, సిమెంట్, మట్టి రోడ్ల హద్దులు, శ్రీరాంసాగర్ కాలువల హద్దులు నిర్ణయిస్తారు. మూడో దశలో ప్రభుత్వ భూముల హద్దులు నిర్ణయిస్తారు. 4వ దశలో పట్టా భూముల రైతుల హద్దులను నిర్ణయిస్తారు. ఈ విధంగా ప్రభుత్వం దశల వారీగా భూముల రీ సర్వే నిర్ణయిస్తారని తెలిపారు. త్వరలో జరుగబోయే సర్వే కు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ నాగండ్ల రాధిక, కార్యదర్శి గంగుల సంతోష్, ఏఈఓ గుడికందుల అరవింద్ ఉపసర్పంచ్ బాద్రపు ప్రవళిక ప్రశాంత్, వార్డు సభ్యులు పబ్బు స్రవంతివెంకటేష్, జక్కుల పద్మచందన్, కెక్కర్ల ఉషశోక్, కలవేన రవి, కండె సాహితిపోశం, అల్లి రమేష్, బత్తిని ప్రశాంత్, పున్నం మణితేజ, బత్తుల రాజమణిరమేష్, జుట్టు యశోద, కండె లక్ష్మిగట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.



వర్షాభావ పరిస్థితుల్లో రైతులు అప్రమత్తంగా ఉండాలి: ఏఓ

గొల్లపల్లి, జూలై 16 (ప్రభాతవార్త):

వర్షాభావ పరిస్థితుల్లో రైతులు పంటల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వ్యవసాయ విస్తీర్ణాధికారి (ఏఓ) కరుణ సూచించారు. గురువారం అబ్బాపూర్ గ్రామంలో రైతులకు వర్షాభావ పరిస్థితులు పంటల నిర్వహణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించి పంటల యాజమాన్యంపై రైతులకు పలు సూచనలు చేశారు.ప్రస్తుతం పత్తి పంట మొలక దశలో ఉందని, ఈ దశలో తెల్లదోమ, జాసిడ్స్, తామర పురుగు వంటి రసం పీల్చే పురుగులను నిరంతరం గమనించాలని తెలిపారు. ఆర్థిక నష్ట పరిమితి దాటిన తర్వాత మాత్రమే పురుగు మందుల వినియోగం చేపట్టాలని సూచించారు.నేలలో తగినంత తేమ ఏర్పడే వరకు



ఎరువుల వినియోగాన్ని వాయిదా వేయాలని, కలుపు నియంత్రణతో పాటు నేల తేమ సంరక్షణ కోసం తరచూ అంతర దుక్కులు నిర్వహించాలని రైతులకు సూచించారు.మొక్కజొన్న పంట కూడా మొలక దశలో ఉన్నందున నేల తేమను కాపాడేందుకు, కలుపు నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. పొడి వాతావరణ పరిస్థితులు కత్తెర పురుగు ఉధృతికి అనుకూలంగా ఉంటాయని, పంటను నిరంతరం పరిశీలించాలని సూచించారు. కత్తెర పురుగు ఉధృతి మధ్యస్థంగా ఉంటే లీటరు నీటికి 5 మిల్లీలీటర్ల (1500 పీపీఎం) వేపనూనె కలిపి పిచికారీ చేయాలని, తీవ్రంగా ఉంటే లీటరు నీటికి 0.3 గ్రాముల ఎమామెక్టిన్ బెంజోయేట్ లేదా 0.4 మిల్లీలీటర్ల క్లోరాంట్రానిలిప్రోల్ పిచికారీ చేయాలని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సంధ్య, గ్రామ సర్పంచ్ చిట్యాల సౌందర్య, ఉపసర్పంచ్ చెవుల రవీందర్ తో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

సర్ గడువు ఆగస్టు 3 వరకు పొడిగింపు.

గొల్లపల్లి, ప్రభాతవార్త:

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ గడువును కేంద్ర ఎన్నికల సంఘం ఆగస్టు 3, 2026 వరకు పొడిగించినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు .ముసాయిదా ఓటర్ల జాబితాను ఆగస్టు 10న విడుదల చేయనుండగా, అదే రోజు నుంచి సెప్టెంబర్ 9 వరకు అభ్యంతరాలు, పేర్ల చేర్పులు, మార్పులు చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 12న ప్రచురించనున్నట్లు తెలిపారు.గొల్లపల్లి మండలంలోని 44 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 39,100 ఎన్యూమరేషన్ పత్రాలను బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) వంద శాతం ఓటర్లకు పంపిణీ పూర్తి చేశారు. బుధవారం నాటికి 31,634 మంది ఓటర్లు తమ ఎన్యూమరేషన్ పత్రాలను పూర్తి చేసి బీఎల్ఓలకు అందజేయగా, మండలంలో 80.91 శాతం సర్ ప్రక్రియ పూర్తై జిల్లాలోనే రెండో స్థానంలో నిలిచినట్లు అధికారులు తెలిపారు.ఇందులో 15,104 మ్యాపింగ్‌లు బీఎల్ఓల ద్వారా పూర్తి కాగా, 16,272 మంది ఓటర్లు స్వయంగా సెల్ఫ్ మ్యాపింగ్ చేసుకున్నారు. ఇంకా 231 మ్యాపింగ్‌లు మాత్రమే పూర్తి కావాల్సి ఉందని పేర్కొన్నారు.మండలంలో సర్ ప్రక్రియపై అవగాహన కల్పించడంలో రెవెన్యూ, పంచాయతీ శాఖ సిబ్బంది,బి ఎల్ వో లు,గ్రామ సర్పంచులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్థానిక యువకులు, స్వచ్ఛంద కార్యకర్తలు చురుకుగా పాల్గొని ఓటర్లకు సహకరిస్తున్నారు. గడువు ముగిసేలోపు మిగిలిన ఓటర్లు కూడా తమ ఎన్యూమరేషన్ పత్రాలను పూర్తి చేసి గడువులోగా సమర్పించాలని అధికారులు సూచించారు

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

పెగడపల్లి, ప్రభాతవార్త:

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని జగిత్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ రమేష్ పేర్కొన్నారు. జగిత్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ గురువారం పెగడపల్లి బస్ షెల్టర్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. బస్ షెల్టర్‌లో ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, ఎదురవుతున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రయాణికులు బస్ షెల్టర్‌లో తాగునీరు, తగిన కూర్చునే ఏర్పాట్లు, పరిశుభ్రత, లైటింగ్, బస్సుల సమయపాలన, సమాచార బోర్డుల ఏర్పాటు వంటి అంశాలను డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. వాటిపై స్పందించిన ఆయన



ప్రయాణికుల సౌకర్యాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని, అవసరమైన వసతులను దశలవారీగా కల్పించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. అలాగే బస్ షెల్టర్‌ను పరిశుభ్రంగా ఉంచడం, ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవడం, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి అవసరమైన మరమ్మతులు చేపట్టడం జరుగుతుందని చెప్పారు. ప్రజల నుంచి వచ్చే సూచనలు, ఫిర్యాదులను సానుకూలంగా స్వీకరించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. పెగడపల్లి మండల ప్రజలకు నాణ్యమైన ఆర్టీసీ సేవలు అందించేందుకు అధికారులు కట్టుబడి ఉన్నారని, ప్రయాణికుల సహకారంతో సేవలను మరింత మెరుగుపరుస్తామని డిపో మేనేజర్ ఎన్. రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఓరగల శ్రీనివాస్, కడారి తిరుపతి, సంధి మల్లారెడ్డి, బండారి శ్రీనివాస్, చెట్ల కిషన్, గర్వందుల రాజశేఖర్ గౌడ్, వెంకటస్వామి, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో జిల్లాను అగ్రస్థానంలో ఉంచాలి

ప్రభాత వార్త కోనరావుపేట

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో రాజన్న సిరిసిల్ల జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉంచేందుకు అందరూ సమన్వయంతో పని చేయాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అంజెల అల్ఫ్రెడ్ అన్నారు. గురువారం ఆమె డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నాగేంద్రబాబు, ఇతర ప్రోగ్రామ్ అధికారులతో కలిసి కోనరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. డ్రై డే పై అవగాహన కల్పించాలి ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పనిచేసే వైద్య సిబ్బంది, స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి ప్రతి మంగళవారం, శుక్రవారం “డ్రై డే“ విధానాన్ని ప్రజలు పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. దోమల నివారణకు ఇది కీలకమని తెలిపారు. సిజేరియన్ శాతం తగ్గించాలి జిల్లాలో సిజేరియన్ కాన్పుల శాతం ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లుల సమావేశాల్లో సాధారణ ప్రసవాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని అన్నారు. గర్భిణులు ఉన్నప్పుడే యోగా నేర్పించాలని, ముఖ్యంగా మొదటి గర్భం దాల్చిన మహిళల ఇంట్లోని పెద్దలకు నార్మల్ డెలివరీ వల్ల కలిగే లాభాలను వివరించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇచ్చే మందులను తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు.హెచ్ పీవి వ్యాక్సిన్ తీసుకోవాలివ్యాక్సిన్ ద్వారా మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం 14 సంవత్సరాలు పూర్తయి 15 సంవత్సరాల లోపు ఉన్న బాలికలకు ఈ వ్యాక్సిన్ ఇస్తున్నామని తెలిపారు. యువతులు, బాలికలు వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా భవిష్యత్ ఆరోగ్య సమస్యలను నివారించుకోవచ్చన్నారు. వ్యాక్సిన్ పై ఉన్న అపోహలను వీడి ఆరోగ్య సిబ్బంది సూచనల మేరకు ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నాగేంద్రబాబు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సంపత్, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ నయీమ్, కోనరావుపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సురేష్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు

ధర్మపురి వార్త

భూ రీ సర్వే పనులను వేగవంతం చేయాలి.



ధర్మపురి/గొల్లపల్లి,ప్రభాతవార్త.

భూ రీ సర్వే పనులను వేగవంతం చేయాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బి ఎస్ లత అధికారులను ఆదేశించారు. ధర్మపురి మండలం నాగారం,గొల్లపల్లి మండలం అబ్బాపూర్ గ్రామాల్లో గురువారం భూముల రీసర్వేకు సంబందించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమి రీ సర్వే చేయడంలో చట్ట పరిదిలో ఉన్న సర్వే,సరిహద్దు చట్టం 1923 తోపాటు సర్వే చేయు పని విదానాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. భూ రీ సర్వే కార్యక్రమం పారదర్శకంగా జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి,గొల్లపల్లిమండలాల తహసిల్దార్లు శ్రీనివాస్,మాజిద్ ,నాగారం గ్రామ సర్పంచ్ చిలుముల లక్ష్మణ్, మార్కెట్ కమిటీ చైర్మన్లు చిలుముల లావణ్య, భీమ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా విక్రయిస్తే కఠిన చర్యలు



ధర్మపురి,ప్రభాతవార్త.

నాటు సారా తయారుచేసినా లేదా విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అబ్కారీ శాఖ ఇంచార్జ్ సీ ఐ జమీల్ హెచ్చరించారు.బీర్పూర్ మండలం,తుంగూర్ గ్రామానికి చెందిన నర్సయ్య నాటుసారాయి అమ్ముతూ,పట్టుబడగా రూ.50 వేలు జరిమానా విధించారు.నర్సయ్య ఇంతకు ముందు సైతం నాటు సారా విక్రయిస్తూ పట్టుబడగా కేసు నమోదుచేసి బీర్పూర్ తహశీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు సి ఐ తెలిపారు. కాగా బైండోవర్ ను ఉల్లంఘిస్తూ తిరిగి నాటుసారా అమ్మడంతో జరిమానా విదించినట్లు ఆయన పేర్కొన్నారు.

పేద మహిళకు సరుకులు పంపిణీ.



ధర్మపురి,ప్రభాతవార్త.

ధర్మపురి మండలం,నక్కల పేట గ్రామానికి చెందిన సిద్ధం రాజేశ్వరి అనే నిరుపేద మహిళలకు ధర్మపురి పట్టణానికి చెందిన శ్రీ లక్ష్మీనరసింహ స్వచ్ఛంద సంస్థ సభ్యులు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు.ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను గుర్తించి, ప్రతినెల రెండు పేద కుటుంబాలకు నిత్యవసర సరుకులను పంపిణీ చేస్తున్నారు.స్వచ్ఛంద సంస్థ సభ్యులు కొరిడె కిరణ్,చీరినేని లక్ష్మణ్ లు గురువారం సదరు మహిళ ఇంటికి వెళ్లి సరుకులను పంపిణీ చేశారు

బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

బీఆర్ఎస్ బిఎల్ఏ లకు ఓటర్ జాబితా సవరణపై అవగాహన సదస్సు

బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి,ప్రభాతవార్త:

రాబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్క కార్యకర్త కృషి చేయాలని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి,బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు,కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ లు అన్నారు.పట్టణంలోని విధిత్ రెడ్డి గార్డెన్స్‌లో కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బూత్ లెవల్ ఏజెంట్ల(బిఎల్ఏ) కోసం ఓటర్ జాబితా సవరణ ప్రక్రియపై గురువారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈసమావేశానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి, జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు,కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ కుమార్,మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి,మాజీ జెడ్పీ చైర్మన్ దావ వసంత సురేష్ లు హాజరై బిఎల్ఏ లకు మార్గదర్శనం చేశారు.ఈసందర్భంగా వారు వేర్వేరుగా మాట్లాడుతూ..ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితా అత్యంత కీలకమని,ప్రతి అర్హత కలిగిన ఓటరుకు ఓటు హక్కు కల్పించడంలో బిఎల్ఏ ల పాత్ర ఎంతో బాధ్యతాయుతమైనదని పేర్కొన్నారు.ఓటర్ జాబితా సవరణ ప్రక్రియను అత్యంత బాధ్యతతో నిర్వహించాలని,అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు,అనర్హమైన నమోదులు,డూప్లికేట్ ఎంట్రీలు,మరణించిన వారి పేర్లు వంటి అంశాలను చట్టబద్ధంగా గుర్తించి సంబంధిత అధికారులకు తెలియజేయాలని





సూచించారు.ప్రతి బూత్ స్థాయిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ,ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి కార్యకర్త పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు అండగా నిలవాలని,ఎన్నికల సంఘం విడుదల చేసిన మార్గదర్శకాలను పూర్తిగా అధ్యయనం చేసి,ఎలాంటి పొరపాట్లు జరగకుండా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు.ఈకార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ బి ఎల్ ఏ లు,మండల,పట్టణ అధ్యక్షులు,కౌన్సిలర్లు, సర్పంచులు,పార్టీ కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

అసలు సిరిసిల్లకు ఏమైంది?

సిరిసిల్ల బ్యూరో, ప్రభాతవార్త

మళ్లీ ఫుడ్ పాయిజన్ కలకలం

నిత్యం ఆసుపత్రి పాలవుతున్న జనాలు

నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ఫుడ్ ఇన్స్పెక్టర్

బకాసుర రెస్టారెంట్‌లో బిర్యానీ తిని నలుగురు యువకులకు అస్వస్థత..



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మరోసారి ఫుడ్ పాయిజన్ ఘటన తీవ్ర కలకలం రేపింది. పట్టణంలోని 'బకాసుర' రెస్టారెంట్‌లో మండి బిర్యానీ తిన్న నలుగురు యువకులు తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలయ్యారు. బిర్యానీ ఆరగించిన కొద్దిసేపటికే వీరంతా ఒకరి వెనుక ఒకరు వాంతులు, విరేచనాలతో కుప్పకూలారు. గమనించిన స్థానికులు వెంటనే వారిని వైద్యం నిమిత్తం తరలించగా, బాధితుల్లో ఒకరి పరిస్థితి తీవ్రంగా ఉండటంతో హుటాహుటిన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన ముగ్గురు యువకులకు సమీపంలోని ఆర్ఎంపీ వైద్యుడి వద్ద ప్రాథమిక చికిత్స అందించారు. కలుషిత ఆహారం తీసుకోవడం వల్లే వీరికి ఫుడ్ పాయిజన్ అయినట్లు వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించగా, ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడి పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ వరుస ఘటనలు చూస్తుంటే అసలు సిరిసిల్లకు ఏమైంది? జనాలు రెగ్యులర్ గా ఫుడ్ తిని ఎందుకు అస్వస్థతకు గురవుతున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇటీవల కాలంలో సిరిసిల్ల జిల్లాలో వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు వెలుగుచూస్తుండటంపై ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. మొన్న పానీపూరి స్వీట్ హౌస్, నేడు బకాసుర రెస్టారెంట్.. ఇలా జిల్లాలో చిరుతిండ్లు తినాలన్నా, హోటల్‌కు వెళ్లాలన్నా ప్రజలు వణికిపోతున్నారు. జిల్లాలో హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, వీధి వ్యాపార బండ్ల నిర్వహణ పూర్తిగా నియంత్రణ కోల్పోయినట్లు కనిపిస్తోంది. ఎక్కడ చూసినా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న రెస్టారెంట్లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రోడ్లపై బండ్లు పెట్టుకొని కుచ్చులు, బజ్జీలు వేస్తూ నాణ్యతలేని నూనెలు, కుళ్ళిన పదార్థాలు వాడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇంత జరుగుతున్నా స్థానిక ఫుడ్ ఇన్స్పెక్టర్ వ్యవహారశైలిపై ప్రజల నుండి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన ఫుడ్ ఇన్స్పెక్టర్ ఆఫీసుకే పరిమితమై, నామమాత్రపు తనిఖీలతో కాలక్షేపం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు వ్యాపార లాభాపేక్షతో నిల్వ ఉంచిన, నాణ్యత లేని ఆహారాన్ని విక్రయిస్తున్నా.. వాటిని పర్యవేక్షించాల్సిన ఫుడ్ ఇన్స్పెక్టర్ ఎందుకు మౌనంగా ఉంటున్నారని, చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక ఉన్న మతలబు ఏంటని స్థానికులు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ఫుడ్ ఇన్స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, అలాగే క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు చేపట్టి కలుషితాహారం విక్రయించే నిర్వాహకులపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన డీఈవో

కరీంనగర్ కలెక్టరేట్, ప్రభాతవార్త:



కరీంనగర్ జిల్లా విద్యాశాఖ అధికారిగా (డీఈవో) నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైతన్య జైనీ గురువారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను ఆమె ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో విద్యా ప్రమాణాల మెరుగుదల, ప్రభుత్వ విద్యా కార్యక్రమాలుసమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి డీఈవోగా విధులు నిర్వహించిన విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రశాంత్‌రెడ్డి కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

కరీంనగర్ రూపురేఖలు మారుస్తా

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి ప్రాథమిక



లక్ష్యమని, తన ధ్యాస, శ్వాస అంతా కరీంనగర్ అభివృద్ధిపైనే ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.గురువారం కరీంనగర్ లో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్లతో కలిసి 36వ డివిజన్ మారుతీనగర్,27వ డివిజన్ శివాజీ నగర్ ప్రాంతాల్లో సుమారు రూ.1.09 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, స్మార్ట్ సిటీ, అమృత్ 1, 2, యూడీఎఫ్ పథకాల ద్వారా కేంద్రం నుండి వేల కోట్ల నిధులను కరీంనగర్ అభివృద్ధికి మళ్లించామని తెలిపారు. ఇటీవల అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద మంజూరైన రూ.840 కోట్ల నిధులతో నగర రూపురేఖలను పూర్తిగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఈ నిధులతో మోడల్ రోడ్లు, స్కై వాక్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణంతో పాటు, నగరం నలుమూలలా గల్లీగల్లీలో సీసీ రోడ్లను నిర్మించి కరీంనగర్‌ను సుందర నగరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.తన ఏడేళ్ల ఎంపీ పదవీ కాలంలో కరీంనగర్ అభివృద్ధి కోసం దాదాపు నిధులను కేంద్రం నుండి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. విద్య, క్రీడలు, వైద్యం,మౌలిక వసతుల కల్పనలో అనేక ప్రాజెక్టులను పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఖిమోదీ గిఫ్ట్‌ఖి పేరుతో సైకిళ్ల పంపిణీని కొనసాగిస్తూ, ఈ ఏడాది కూడా మరో 20 వేల సైకిళ్లను ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. కరీంనగర్‌ను తెలంగాణలోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దే వరకు తన కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాలి

జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎస్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులకు సూచించారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం త్రాగునీటి సరఫరా, సీజనల్ వ్యాధుల నియంత్రణ, విద్యాశాఖ, సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగిత్యాల జిల్లా సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వానికి త్రాగునీటి సరఫరా అత్యంత ప్రాధాన్యత అంశమని తెలిపారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అన్ని ప్రాజెక్టుల్లో తాగునీటికి అవసరమైన నీటి మట్టాలను తప్పనిసరిగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.పట్టణ ప్రాంతాల్లో అమృత్ పథకం కింద చేపట్టిన తాగునీటి సరఫరా పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.వీబీజీఆర్ఏఎంజీ కార్యక్రమంలో భాగంగా ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని



వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రతి గ్రామంలో పడే ప్రతి నీటి బొట్టును సంరక్షించేలా, ఇంకుడు గుంతలు, ఇతర నీటి సంరక్షణ పనులను సమర్థవంతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.కాలానుగుణ వ్యాధుల నివారణకు స్థానిక సంస్థలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతి శుక్రవారం అన్ని గ్రామాలు, పట్టణాల్లో డ్రైడే కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలని, ప్రజల్లో నీటిని నిల్వ ఉంచవద్దు అనే అంశంపై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. దోమల నివారణ చర్యలు, పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు.విద్యాశాఖకు సంబంధించి విద్యార్థులకు అందించాల్సిన యూనిఫాంలలో ఒక జతను ఆగస్టు 15 నాటికి తప్పనిసరిగా పంపిణీ చేసేలా జిల్లా స్థాయిలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధంగా ఉంచి రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, జిల్లా ప్రణాళిక అధికారి జి. రవీందర్, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఈఈ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మట్టిమాఫియా చేసిన దాడిని ఖండిస్తున్నాం -మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



నర్సంపేట, జులై 16, ప్రభాతవార్త

మట్టి మాఫియాను ప్రశ్నిస్తున్న ప్రభుత్వ అధికారులపై, ప్రజాప్రతినిధులపై జరుగుతున్న దాడులపై నర్సంపేట ఎమ్మెల్యే బాధ్యత వహించాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం బాదిత 16వ వార్డు మెంబర్ నవీన్‌నాయక్‌ను పెద్ది పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి మాఫియా చేస్తున్న కాంగ్రెస్ నాయకులకు సహకరిస్తున్న పోలీసులు, అధికారులు నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా మట్టి మాఫియా పెంచి పోషిస్తున్న స్థానిక ఎమ్మెల్యే జరుగుతున్న దాడులకు బాధ్యత వహించాలన్నారు. దాడులు చేస్తున్న మట్టి మాఫియా పైన కొత్తగా వరంగల్‌కి వచ్చిన నూతన సిపి శ్వేత దృష్టి పెట్టాలన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అధికారులను పోలీసులు ఉపయోగించి కాంగ్రెస్ నాయకులు మట్టి మాఫియా నడిపిస్తూ ప్రజలను రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు, కౌన్సిలర్లు, క్లస్టర్ బాధ్యులు, పార్టీ సీనియర్ నాయకులు, వార్డు అధ్యక్షులు, మాజీ సర్పంచ్లు, మాజీ కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులు, పాల్గొన్నారు.

బీఎల్‌వోలను సన్మానించిన తహసీల్దార్

ఖానాపురం, జులై 16, ప్రభాతవార్త



వంద శాతం ఎన్యుమరేషన్ ఫామ్‌లను పూర్తి చేసిన బీఎల్‌వోలను తహసీల్దార్ రమేష్ గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనుబోతులగడ్డ బీఎల్‌వో బోడ సంతోష్ మండలంలో ముందుగా 100 పూర్తి చేశారని, ఆ తర్వాత రంగాపురం పిఎస్ నెంబర్ 101 కత్తి కుమారస్వామి, పిఎస్ నెంబర్ 94 ఖానాపురం సూడి సునీత, కొత్తూరు పిఎస్ నెంబర్ 113 కాసు యాకయ్య, పిఎస్ నెంబర్ 116 ధర్మరావు పేట పల్లెపాటి రాణి 100 పూర్తి చేయగా వీరి సేవలను గుర్తించి సన్మానించినారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాహసిల్దార్ రాజారేణుక ,ఏఎస్ఓ సుగుణ, సీనియర్ అసిస్టెంట్ వంశి చౌహన్, ఎమ్మారై గాయత్రి, ఏఆర్ఐ చేనుమల్ల స్వామి. జిపిఓలు అల్లే అనిల్, పుట్టపాక రమేష్, భువనగిరి నాగరాజ్, బక్కి వెంకటేశ్వర్లు, కొమ్ముక స్వప్న, హైమావతి, చింత కింది మహేందర్, భూభారతి ఆపరేటర్ చల్ల శివసాయి. ఆఫీస్ సబార్డినేటర్స్ వీరయ్య, రవికుమార్, వీఆర్ఏ సంఘపు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వరుణ దేవా కరుణించు -పాడి పంటలను కాపాడు



నల్లబెల్లి, జులై 15, ప్రభాతవార్త

వరుణ దేవా ఈ ఏడు వర్షాలు బాగా కురిపించి మా పాడి పంటలు కాపాడు అని కోరుతూ మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించిన సంఘటన నల్లబెల్లి మండలం రాంపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఈ సంవత్సరం వర్షాలు సరిగా కురువకపోవడంతో ఓపక్క సాగునీరు మరోపక్క తాగునీటికి ఇబ్బందికరంగా మారడంతో రాంపూర్ గ్రామ మహిళలు ఇంటికి ఒక బిందెతో గ్రామ దేవతతో పాటు పోచమ్మ తల్లి దేవాలయం స్థానిక ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి జిలాభిషేకం చేశారు. అనంతరం వరుణ దేవా మమ్ములను కరుణించు అంటూ కోలాటాలు భజనలు చేయడం పలువురిని ఆకర్షించింది. వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండడంతో పాటు తాగునీటికి సైతం ఇలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని వర్ణదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు స్థానిక మహిళలు పేర్కొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చడంలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు విఫలం

రామగిరి ప్రభాతవార్త



ఎన్నికల హామీలు నెరవేర్చడంలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు విఫలమయ్యాయని, మితిమీరిన రాజకీయ జోక్యంతో సంస్థ మనుగడకు ముప్పు వాటిల్లిందని సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు మంద నరసింహారావు అన్నారు. గురువారం ఆర్ జి త్రీ ఓసిపి టూ లో సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి దొమ్మటి కొమురయ్య అధ్యక్షతన గేట్ మీటింగ్ నిర్వహించగా ముఖ్య అతిథిగా నరసింహారావు హాజరై మాట్లాడారు. సంస్థ పరిరక్షణ,ఉద్యోగ భద్రత మరియు రాష్ట్ర ప్రభుత్వం నుండి రావలసిన 54,000/ కోట్ల రూపాయలు రాబట్టడం. మరియు కేంద్ర బీజేపీ ప్రభుత్వం నుండి 15 బొగ్గు బ్లాకుల సాధనకై ఐక్యపోరాటాలకు అన్ని కార్మిక సంఘాలు,కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సింగరేణి లో మితి మీరిన రాజకీయ జోక్యం వలన సంస్థ మనుగడ ప్రశ్నర్థకం గా మారిందని, ప్రభుత్వం నుండి బకాయిలు వసూలు చేయడం లో, ఎన్నికల హామీలు నెరవేర్చడం లో గుర్తింపు, ప్రాతినిత్య సంఘాలు విఫలం అయ్యాయని, కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేఖ విధానాలు, లేబర్ కోడ్ ల రద్దుకై అన్ని సంఘాలని కలుపుకుని ఐక్యంగా పోరాడాలని, కానీ గుర్తింపు, ప్రాతినిత్య సంఘాలు మాట మీద నిలబడకుండా సమ్మె ఊసు ఎత్తకుండా కాల యాపన చేస్తున్నారని తెలిపారు.అదే విధంగా 2020 కి ముందు అండర్ గ్రౌండ్ నుండి సర్పేస్ కి వచ్చి బేసిక్ లు నష్టపోయిన జనరల్ అసిస్టెంట్ ల తరపున ఏ యూనియన్ చేయని పని ని సిఐటియు ఒంటరిగా ఐదు సంవత్సరాలు సుదీర్ఘంగా పోరాటం చేసి హై కోర్ట్ లో కేస్ గెలిచి, నష్టపోయిన కార్మికులందరికి తిరిగి లాభం చేకూర్చిందని తెలిపారు. అదే విధంగా 2020 తరవాత అండర్ గ్రౌండ్ నుండి సర్పేస్ కి వచ్చి బేసిక్ లు నష్టపోయిన జనరల్ అసిస్టెంట్ ల అందరి తరపున కూడా న్యాయ పోరాటానికి సిఐటియు సిద్ధంగా ఉందని, బేసిక్ నష్టపోయిన కార్మికులు అందరు కూడా సిఐటియు బ్రాంచ్ ఆఫీస్ నందు సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమం లో సిఐటియు నాయకులు ఎద్దుకుమార్, ఎన్.రమణారెడ్డి, అసరి మహేష్, కె.వేణుగోపాల్, ఎం.కామేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం బీఆర్ఎస్ అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దు

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:





రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా పాలన ప్రభుత్వం పని చేస్తుందని, బిఆర్ఎస్ చేసే అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారంకోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలోని వ్యవసాయ మార్కెట్ లో రూ.51 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. 38 మంది లబ్ధిదారులకు రూ.15 లక్షల 46 వేల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశంలో ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని,ఇటీవల తమిళనాడు ముఖ్యమంత్రి గా ప్రమాణ స్వీకారం చేసిన విజయ్ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం పై, కేరళ ముఖ్యమంత్రి మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం పై మొదటి సంతకం చేశారని గుర్తు చేశారు.రాష్ట్రంలో కుల గణన చేసిన తర్వాత నరేంద్ర మోదీ దిగి వచ్చి దేశంలో జనగణ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు.దేశంలో ఎక్కడ లేని విధంగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేశామని, కుల,మతాలకు, పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు.గతంలో బేస్ మెంట్, గోడలు కట్టుకుని ఉన్నా వారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు కింద ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారని అన్నారు.త్వరలో అమలు చేయనున్న ఇందిరమ్మ భీమా పథకం దేశంలో, ప్రపంచంలో ఎక్కడా లేదని, రాష్ట్ర ప్రభుత్వం అప్పుల్లో ఉన్నా, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. రేషన్ కార్డు ఉన్న వారి అందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, రైతు రుణ మాఫీ చేశామని, రైతు భరోసా అందిస్తున్నామన్నారు.బీఆర్ఎస్ చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దన్నారు.వేములవాడ నియోజకవర్గ అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలు గమనిస్తున్నారని, అందుకే బీఆర్ఎస్ నాయకులు ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రహదారులు, బ్రిడ్జిల నిర్మాణం, సాగునీటి ప్రాజెక్టులు, వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి పనులకు ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసిందన్నారు.బ్రిడ్జిలకు నిధులు లేవంటూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. మండలంలో రెండు బ్రిడ్జిలకు సంబంధించిన అంచనాలు సిద్ధమయ్యాయని, మరో బ్రిడ్జికి డ్రాయింగ్ పనులు కొనసాగుతున్నాయన్నారు.గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన లో శిలాఫలకాలు వేయడం తప్ప అభివృద్ధి పనులు పూర్తి చేయలేదన్నారు. వేములవాడ మూడో బ్రిడ్జికి 2015లో శంకుస్థాపన చేసినప్పటికీ, 10 సంవత్సరాల పాటు బాధిత కుటుంబాలకు నష్టపరిహారం కూడా ఇవ్వలేకపోయారని,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.6.96 కోట్ల నిధులు విడుదల చేసి బాధితులకు పరిహారం అందించి, పనులను పునఃప్రారంభించమ న్నారు. రాజన్న ఆలయ అభివృద్ధి పనులు ప్రస్తుతం 45 శాతం పూర్తయ్యాయని, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రహదారి విస్తరణ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని, భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న 80 అడుగుల రహదారి త్వరలో పూర్తవుతుందన్నారు. కలికోట సూరమ్మ ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్ రైతులను మోసం చేసిందని, "ఈ దసరాకే నీళ్లు" అంటూ హామీలు ఇచ్చి ఐదేళ్లు గడిచినా ప్రాజెక్టును పూర్తి చేయలేదన్నారు. భూసేకరణ చేయకుండా, రైతులకు నష్టపరిహారం ఇవ్వకుండా శంకుస్థాపనలతోనే కాలం గడిపారని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ప్రాజెక్టుకు అవసరమైన నిధులు విడుదల చేశామని, ఇప్పటికే ఎడమ కాల్వ రైతులకు పరిహారం అందించామన్నారు. మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు.కొంతమంది బీఆర్ఎస్ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం వడ్ల కొనుగోళ్లు, ఇతర అంశాలపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని,తప్పు చేసిన వారెవరైనా చట్టం ముందు సమానమేనని, ఏ పార్టీకి చెందిన వారైనా అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ప్రజల మధ్య ఉండకుండా ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే నాయకులు ఇప్పుడు అభివృద్ధిపై మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేస్తూ ప్రతి హామీని నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నామని, వేములవాడ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చాకాయల ఎల్లయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుంద రెడ్డి,వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానుక సత్యం, ఫ్యాక్స్ చైర్మన్ బండ నర్సయ్య, నాయకులు ఫిరోజ్ పాషా, చేపూరి గంగాధర్, గొట్టే రుక్మిణి,మార్కెట్ కమిటీ సభ్యులు పలు గ్రామాల సర్పంచులు నాగభూషణం, శ్రీహరి నరేష్ నాయక్, దేవరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కచ్చకాయల బాలరాజు, వీరవేని తిరుపతి యాదవ్, నీరజ్ సంజీవ్, సుంకరిరెడ్డి, ఉప్పల గంగయ్య, నీరటి సురేష్, అవురం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్ కార్యక్రమాన్ని ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరు నిరక్ష్యం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలి.....

జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త:

ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరు నిరక్ష్యం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం పిలుపునిచ్చారు.



జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్ పర్సన్ స్వప్న సదానందం మాట్లాడుతూ ఓటరు జాబితా పూర్తిస్థాయిలో పారదర్శకంగా, తప్పులు లేకుండా రూపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇప్పటికే ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వారు తమ వివరాలను ఒకసారి పరిశీలించుకోవాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు బి ఎల్ ఓలు ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరించినప్పుడు ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. అవసరమైన పత్రాలను సమర్పించి ఓటరు జాబితాను ఖచ్చితంగా రూపొందించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

జమ్మికుంట పట్టణంలో గోశాల ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేత....

జమ్మికుంట/ హుజూరాబాద్, ప్రభాతవార్త

: కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో గోశాల ఏర్పాటు చేయాలని మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ పాలకవర్గ సభ్యులకు పట్టణ ప్రజల తరఫున హృదయపూర్వక విజ్ఞప్తి చేస్తూ గురువారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పుదారి రేణుక శివకుమార్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రేణుక మాట్లాడుతూ జమ్మికుంట పట్టణ అభివృద్ధి కోసం



మున్సిపల్ పాలకవర్గం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అభినందిస్తూ, అత్యంత ముఖ్యమైన ప్రజా, సామాజిక అంశమైన గోమాతల సంరక్షణ కోసం శాశ్వత గోశాల ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని రేణుక గుర్తు. చేశారు. ప్రస్తుతం జమ్మికుంట పట్టణంలో అనేక గోవులు రోడ్లపై, వీధుల్లో సంచరిస్తూ ప్లాస్టిక్ కవర్లు, విషపూరిత వ్యర్థాలు, మిగిలిపోయిన ఆహార పదార్థాలను తిని అనారోగ్యానికి గురవుతున్నాయని, రహదారులపై తిరుగుతున్న గోవుల కారణంగా తరచూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటమే కాకుండా ప్రమాదాలు జరిగే అవకాశాలు కూడా పెరుగుతున్నాయన్నారు. దీనివల్ల ప్రజల భద్రతతో పాటు మూగజీవాల సంక్షేమానికి సంబంధించిన అత్యంత కీలకమైన అంశమని, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు ఈ సమస్యను అత్యవసరంగా పరిగణించి, గోశాల ఏర్పాటు కోసం తగిన స్థలాన్ని గుర్తించి మంజూరు చేయడంతో పాటు అవసరమైన చర్యలు వెంటనే ప్రారంభించాలని పట్టణ ప్రజల తరఫున కోరారు. గోమాతల సంరక్షణ అనేది కేవలం ఒక సామాజిక బాధ్యత మాత్రమే కాదు, మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక కూడా. ఈ గొప్ప కార్యక్రమాన్ని మున్సిపల్ పాలకవర్గం చేపట్టి జమ్మికుంట పట్టణానికి ఆదర్శంగా నిలవాలని రేణుక శివకుమార్ కోరారు.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ని కలిసిన వొడితల ప్రణవ్..

జమ్మికుంట/ హుజూరాబాద్ ప్రభాతవార్త:

హుజూరాబాద్ పట్టణంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ను హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ కోరారు. గురువారం హైదరాబాద్ సెక్రటేరియట్ లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ని మర్యాదపూర్వకంగా కాంగ్రెస్ నేత ప్రణవ్ కలిశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో ప్రొసీడింగ్ ఇచ్చి అసంపూర్తిగా నిర్మించిన దానికి పూర్తి స్థాయిలో నిధులు కేటాయించాలని, దళిత బంధు గ్రౌండింగ్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు



దళిత బంధు అందేలా చూడాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించి దీనిపై ఇప్పటికే పలుమార్లు చర్చించినట్టు తెలిపారు. మరోవైపు హుజూరాబాద్ నియోజవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని సంక్షేమ పాఠశాలలో వసతులకు నిధులు కేటాయించాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత, పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన జీవనం..

సర్పంచ్ పద్మకుమార్

జమ్మికుంట/ హుజూరాబాద్, ప్రభాతవార్త:

జమ్మికుంట మండలం పెద్దంపల్లి గ్రామంలో బాలవికాస ఆధ్వర్యంలో, ఆదిత్యఅమృత మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల సహకారంతో గురువారం పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఎగిత పద్మకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ, పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని అన్నారు. వ్యాధులు రాకముందే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆహారపు అలవాట్లలో చిన్నచిన్న మార్పులు చేసుకోవడం ద్వారా అనేక రోగాలను నివారించవచ్చని సూచించారు. శిబిరంలో ఆదిత్యఅమృత ఆసుపత్రి వైద్య బృందం సుమారు 200 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, రూ. 55 వేల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేసింది. గ్రామానికి విచ్చేసిన స్పెషలిస్ట్ వైద్యులను సర్పంచ్ ఘనంగా సన్మానించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ భరత్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మహిపాల్ మాట్లాడుతూ సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. బియ్యం, రవ్వ, మైదా, చక్కెర వంటి తెల్లటి ఆహార పదార్థాల వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలని కోరారు. అధిక కార్బోహైడ్రేట్లు తీసుకోవడం వల్ల ఊబకాయం పెరిగి మధుమేహం, రక్తపోటు, గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం అధికమవుతుందని హెచ్చరించారు. ప్రతిరోజూ నడకతో పాటు గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యాయామశాలలను వినియోగించుకోవాలని సూచించారు. జమ్మికుంట బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన మాట్లాడుతూ, ప్రతి మహిళ ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకుని వంటింటినే ఆరోగ్యశాలగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. బాలవికాస పరిధిలోని 14 సెంటర్లకు చెందిన 180 గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, దాదాపు రూ. 2 కోట్ల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో ఈ సేవా కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్ ఆసియా, ఉపసర్పంచ్ దొడ్డే నాగరాజు, పాలకవర్గ సభ్యులు ఎం. రాజయ్య, డి. ప్రవీక, డి. తిరుమల, ఎం. రాజేష్, డి. లావణ్య, కే. గణపతి రెడ్డి, పి. అఖిల, బాలవికాస విలేజ్ లీడర్ పి. రమ, ఆదిత్యఅమృత ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, పీఆర్వోలు రఫిక్, దుర్గాప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది అనిల్ రావు, మహేష్, శ్రావణ్, సంతోషిని, పూజ, శ్రావ్య, సుమలతతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

అందించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్)...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త

;జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 16వ వార్డుకు చెందిన జూపాక సరోజన మృతి చెందగా జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులకు సరోజన దహన సంస్కారాల ఖర్చుల నిమిత్తం రూ 5,000 ఆర్థిక సహాయం అందించారు. వృద్ధురాలి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాతకాల అనిల్, ఎక్కపల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆరుతడి పంటల పై రైతులకు అవగాహన

వీణవంక, ప్రభాత వార్త:

ఎల్నినో ప్రభావముతో వర్ష భావ పరిస్థితులు నెలకొనడం వలన ప్రత్యామ్నాయ పంటలైన ఆరుతడి పంటలను సాగు చేయాలని గురువారం



మండలములోని రామకృష్ణాపూర్, పోతిరెడ్డిపల్లి, రెడ్డి పల్లి, మల్లన్నపల్లి, వల్భాపూర్, మామిడాలప ల్లి, దేశాయి పల్లి, మల్లారెడ్డిపల్లి గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. అందులో భాగంగా నీటి లభ్యత తక్కువగా ఉండటం వలన ఆరుతడి పంటలైన మొక్కజొన్న, పెసర, కందులు, వేరుశనగ, బబ్బే ర, సజ్జలు పంటలను సాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి గణేష్, విస్తరణాధికారులు గౌతమి, కీర్తన, లక్ష్మీ ప్రసూన, తిరుపతి, శ్రావణ్ తో రైతులు పాల్గొన్నారు.

మానకొండూర్ అభివృద్ధిలో వెనుకబడింది.

.. టిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ చెన్నమల్ల చైతన్య

మానకొండూర్, ప్రభాతవార్త :



మానకొండూరు నియోజకవర్గం అభివృద్ధిలో చాలా వెనుకబడిందని, దీనం తటికీ గత, ప్రస్తుత పాలకులే కారణమని టిఆర్ ఎస్ పార్టీ మానకొం దూరు నియోజకవర్గం ఇంచార్జ్ చిన్నమల్ల చైతన్య ఆరోపించారు. గురువారం మానకొండూరు మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి టిఆర్ఎస్ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ మానకొండూరు నియోజకవర్గం సమస్యలు పరిష్కారం కోసం తెలంగాణ రక్షణ సేన పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని తెలిపారు. కరీంనగర్ కు అతి సమీపంలో ఉన్న మానకొండూర్ నియోజకవర్గ అభివృద్ధి చెందకపోవడం బి ఆర్ఎస్, కాంగ్రెస్ పాలకుల నిరక్ష్యమ్లన్నారు. శాతవాహన యూనివర్సిటీ జేఏసీ చైర్మన్ గా చేస్తున్న సేవలను గుర్తించి కల్వకుంట్ల కవితక్క తనను నియోజకవర్గ ఇన్చార్జిగా నియమించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం తమ వంతు నిరంతరం కృషి చేస్తాన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు లింగంపల్లి నాగరాజు, సల్మా, అతహర్, జైపాల్ రెడ్డి, గౌతమి, మల్లేశం, రమేష్ గౌడ్, శ్రీనివాస్, రాకేష్, నాగరాజు, రమేష్, పవన్ రామ్ చరణ్, ప్రభాస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కరీంనగర్ లో కదిలిన జగన్నాథుని రథ చక్రం ...

.వైభవంగా జగన్నాథుని రథయాత్ర....

రథాన్ని లాగిన మాజీ మంత్రి గంగుల కమలాకర్....

కరీంనగర్ కల్చరల్, ప్రభాతవార్త:

కరీంనగర్ గురువారం ఖిజై జగన్నాథఖి నామస్మరణలతో మార్మోగింది. గురువారం కరీంనగర్ మహాశక్తి ఆలయం నుంచి శ్రీ పూరి జగన్నాథ స్వామివారి రథయాత్ర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. స్వామివారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలిరావడంతో నగరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వేదపండితులు ప్రత్యేక పూజలు, వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారికి మహామంగళహారతితో అలంకరించిన రథంపై జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవిని ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి రథాన్ని లాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్నాథుని కృపా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, అందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షి ంచారు. మహాశక్తి ఆలయం నుంచి మొదలైన రథయాత్ర లేబర్ అడ్డా, మంకమ్మతోట, గీతాభవన్, బస్టాండ్, వెంకటేశ్వర ఆలయం మీదుగా సాగింది. యాత్ర చివరలో నిర్వాహకులు భక్తులకు మహాప్రసాదం, అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఉత్సవంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

